



# విశ్వంవాయిస్

అవినీతిపై - అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 78 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 11 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# ప్రజలు మెచ్చే పాలన అందివ్వాలి




- ప్రజల కోసం అవసరమైతే బిజినెస్ రూల్స్ మార్చండి
- మాట ఇచ్చాం... విద్యుత్ ఛార్జీలు పెంచం
- వినూత్న ఆలోచనలతో ప్రజలకు సేవలు... అభివృద్ధి పనులు
- చాలా శాఖలు గాడిన పడ్డాయి... ఇంకొన్ని మరింత గేరప్ కావాలి
- రాష్ట్రానికున్న అప్పులన్నింటినీ రీ-షెడ్యూల్ చేస్తున్నాం
- ఏపీ బ్రాండ్ తిరిగి తెచ్చాం... పెట్టుబడులు వచ్చాయి
- మంత్రులు, కార్యదర్శులు, హెచ్వోడీల సమావేశంలో ప్రారంభ ఉపన్యాసంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలు మెచ్చే పాలన అందించే దిశగా ప్రతి విభాగం, ప్రతి అధికారి పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈమేరకు అవసరమైతే ప్రభుత్వ బిజినెస్ రూల్స్ సవరించుకోవాలని సూచించారు. సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీల కాన్ఫరెన్సు జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులు హాజరయ్యారు. వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు చేయాల్సిన ప్రణాళికపై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై సమావేశంలో సమీక్షించారు. అలాగే మూడు, నాలుగు త్రైమాసికాల్లో సాధించాల్సిన లక్ష్యాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. జీఎస్డీపీ, కేపీఐ, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్, డేటా డ్రివెన్ గవర్నెన్సు అంశాలపై సూచనలు చేశారు. దీంతో పాటు సూపర్ సిక్స్ పథకాల, పౌరసేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఫైళ్ల క్లియరెన్సు, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక, అవేర్, డేటా లేక్, ఐటీ అప్లికేషన్లపై సమావేశంలో అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులు వాటి పరిష్కారంపై హెచ్ఓడీలకు సీఎం సూచనలు చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వాటి ఫలితాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ..'18 నెలల పాలను సమీక్షించుకుని ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాల గురించి చర్చించకుని ఆ దిశగా అందరూ పని చేయాలి. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోంది... ప్రజలు మెచ్చే పాలన అందించాలి. ఫైళ్లు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారంతో డేటా లేక్ వ్యవస్థ సిద్ధం అయ్యింది. ఈ సమాచారంతో ఇకపై డేటా డ్రివెన్ గవర్నెన్స్ దిశగా అందరూ పని చేయాలి. నాలెడ్జ్ ఎకానమీ దిశగా ఏపీ అడుగులు వేస్తోంది. అందుకే పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయి. విశాఖలో 1 గిగా వాట్ సామర్థ్యంతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ప్రధానిని మైక్రో సాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కలిశారు. రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమని చెప్పారు. సుపరిపాలన కోసం అవసరమైతే బిజినెస్ రూల్స్ మార్చుకోవచ్చు. ప్రజల అవసరాల కోసం రాజ్యాంగాన్నే చాలాసార్లు సవరణలు చేశారు. ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ ఆఫీసులకు వచ్చే పరిస్థితి ఉండకూడదు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు చేరే పరిస్థితి రావాలి. గత పాలకులు పూర్తిగా కేంద్ర ప్రాయోజిత పథకాలను అస్తవ్యస్తం చేశారు. గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో కేంద్ర ప్రభుత్వం ఏకంగా నిబంధనలే మార్చేసింది. ఆగిపోయిన కేంద్ర పథకాలను తిరిగి పునరుద్దరించాం. వీటిని మరింత సమర్థవంతంగా మిగతా 2లో

### టారిఫ్‌లపై సుప్రీం కోర్టు ఇచ్చే రూలింగ్‌తో

# అమెరికా భద్రతకే ముప్పు : ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశాలపై విధించిన టారిఫ్‌లపై ఆ దేశ సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. పెన్సిల్వేనియాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. టారిఫ్‌లకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ఏదైనా నిర్ణయం తీసుకుంటే దానివల్ల అమెరికా భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సుంకాలను వ్యతిరేకిస్తూ కొందరు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేస్తుండడాన్ని విమర్శించారు. తాను విధించిన టారిఫ్‌ల ద్వారా మిగతా 2లో

# మీ డబ్బు.. మీ హక్కు...

### క్లెయిమ్ చేయని ఆస్తులపై ప్రధాని మోదీ పోస్ట్




**విశ్వం వాయిస్ న్యూస్ :** క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లురూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను మిగతా 2లో

### 58,204 మంది అంగన్వాడీ వర్కర్లకు

# రూ.75 కోట్లతో సెల్ ఫోన్లు

- ఐసీడీఎస్ రాష్ట్ర స్థాయిలో 98 శాతంతో ఏంం కేటగిరి తో నాలుగో స్థానం
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా సేవలు
- నూతన సాంకేతికతతో అంగన్వాడీ సేవలు అందించేందుకు 5 జి సెల్ ఫోన్లు
- మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా సేవల్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు 5 జి మొబైల్ ఫోన్లను అందిస్తున్నామని మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 58,204 మంది అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు 5 జి స్మార్ట్ ఫోన్లను అందించే కార్యక్రమాన్ని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో




మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లకు రూ. 75 కోట్ల వ్యయంతో మొబైల్ ఫోన్లను మిగతా 2లో

### రూ.వందల కోట్లు దోచుకొని

# చిన్న దొంగతనం అంటావా..

### తితిదే బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** హిందువులపై జగన్‌కి ఎంత ద్వేషం ఉందో ఆయన తీరు చూస్తే అర్థమవుతుందని తితిదే బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పరకామణి చోరీ కేసు విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి హుండీ డబ్బులు లెక్కించే క్రమంలో చోరీకి పాల్పడి .. కొన్ని వందల కోట్ల రూపాయలు సంపాదించారని, దానిని చిన్న దొంగతనంగా చూపించేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. "రూ.వేల కోట్లు దొచుకున్న మీకు.. పరకామణి చోరీ కేసు చిన్నదిగా కనిపించడం సహజమే. జగన్, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి.. నూటికి నూరు శాతం పరకామణి కేసులో భాగంగా ఉన్నారనేది మిగతా 2లో

### గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో

# మంత్రి లోకేశ్ భేటీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో ఆయన భేటీ అయ్యారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కుటుంబంలో ఏఐ ప్రొఫెషనల్ ఉండాలనేది చంద్రబాబు విజన్ అని అన్నారు. ఏపీలో గూగుల్ పెట్టుబడి ప్రారంభం మాత్రమేనని చెప్పారు. మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. డ్రోన్ సిటీలో అసెంబ్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఇంటెల్ ఐటీ సీటీవో శేష కృష్ణపురతోనూ మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఇంటెల్ ఏటీఎంపీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో ఇంటెల్ ఏఐ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఎన్ విడియా ప్రతినిధి రాజ్‌మిర్ పురితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఎన్ విడియా స్మార్ట్ ఫ్యాక్టరీ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించాలని కోరారు. భాగస్వామ్య సంస్థలు పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అడోబ్ సీఈవో శంతను నారాయణ్ భేటీ అయ్యారు. ఏపీలో అడోబ్ జీసీసీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. జూమ్ ప్రెసిడెంట్ శంకరలింగంతో మంత్రి సమావేశమై ఏపీలో జూమ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు.

### ప్రమోషన్ల ఆనందం

# ప్రజలకు అందించే సేవల్లో కనబడాలి

- ఉద్యోగులు నిష్పక్షపాతంగా, నిబద్ధతతో వ్యవహరించాలి
- పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికే నూతన సంస్కరణలు
- గత ప్రభుత్వంలో పోస్టింగ్ కీ, ప్రమోషన్ కీ ఓ రేటు కార్డు ఉండేది
- కూటమి పాలంలో సీనియారిటీ, సిన్సియారిటీకే ప్రాధాన్యమిచ్చాం
- నేను జవాబుదారీతనంతో ఉంటా... మీరూ తప్పు చేయొద్దు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులతో మాటా-మంతి కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఒక ప్రభుత్వ ఉద్యోగి కుమారుడిగా ఉద్యోగుల సాధకబాధకాలు నాకు తెలుసు. నా శాఖ పరిధిలో ఉన్న ఉద్యోగులకు ఏం చేయగలనని మొదటి నుంచి ఆలోచించాను. ఉన్నతాధికారులను అడిగితే తీసుకురావాల్సిన సంస్కరణలు చాలా ఉన్నాయని చెప్పారు. ఒక ప్రమోషన్ వస్తే ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది. వారు మరింత ప్రభావవంతంగా పని చేస్తారు. అందుకే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పదోన్నతుల మిగతా 2లో

### తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు..

# 890 గ్రామాల్లో ఏకగ్రీవం : ఎస్ఈసీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ.. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో మిగతా 2లో

# పర్యాటక పురోగతి కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ఎంవోయూ అయిన టూరిజం ఇన్వెస్టర్లతో సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ భేటీ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరితగతిన ప్రాజెక్టులు గ్రౌండ్ చేస్తే ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని, కలిసి పనిచేసి పర్యాటకరంగ పురోగతికి పాటు పడదామని ఎంవోయూ అయిన టూరిజం ఇన్వెస్టర్లతో మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సూచనల మేరకు బుధవారం వెలగపూడి సచివాలయం లోని 5వ బ్లాక్ లో ఇటీవల సీఐఐ పార్ట్ నర్ షిప్ సమ్మిట్ లో ఎంవోయూ అయిన ఇన్వెస్టర్లతో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీఏ సీఈఓ ఆమ్రపాలి, టూరిజం అధికారుల బృందం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇన్వెస్టర్లు లేవనెత్తిన పలు సందేహాలను పర్యాటక శాఖ బృందం నివృత్తి చేసింది. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎంవోయూ కుదుర్చుకున్న ప్రాజెక్ట్ లకు అవసరమైన సమాచారం, ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఇతర శాఖలతో సమస్యలు ఉంటే తాము చర్చించి పరిష్కరిస్తామని ఇన్వెస్టర్లకు భరోసా ఇచ్చారు. త్వరితగతిన ఆర్థికపరమైన భద్రతను సమకూర్చుకోవాలని, బ్రాండింగ్ కంపెనీలతో టైఅప్ అవ్వాలని, త్వరితగతిన ల్యాండ్ పార్సిల్ కి అనుగుణంగా డీపీఆర్ లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ల్యాండ్ మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)

# ప్రజలు మెచ్చే పాలన అందివ్వాలి

వినియోగించుకోవాలి. గత పాలకుల నిర్వాకం వల్ల ఏపీ బ్రాండ్ దెబ్బతింది. దానివల్ల అభివృద్ధి ఆగిపోయింది. ఆదాయం తగ్గింది. క్రెడిట్ రేటింగ్ తగ్గిపోవటం వల్ల వడ్డీల భారం పెరిగింది. ఇప్పుడు ఉన్న అప్పును, వడ్డీలను రీ-షెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి. అన్ని ప్రభుత్వ శాఖలూ, విభాగాలు ఆడిట్ పరిధిలోకి రావాల్సిందే. ప్రధాని నరేంద్ర మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి సుపరిపాలన, అభివృద్ధి, రాష్ట్ర పునర్నిర్మాణ హామీ ఇచ్చాం. ఆ దిశగా పాలన సాగేలా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ పని చేయాలి"అని సీఎం స్పష్టం చేశారు.

**విద్యుత్ కొనుగోలు ఛార్జీలను తగ్గిస్తాం**

'స్వర్ణాంధ్ర విజన్ యూనిట్లను రేషనలైజ్ చేసి గ్రామ, పట్టణ ప్రాంతాల్లో అవసరమైనట్టుగా విధులు చేపట్టేలా మార్చుకుందాం. ప్రతీ ప్రభుత్వ శాఖ ఓ మంచి ఫలితాల కోసమే పనిచేస్తోంది. ఆ ప్రయోజనాలు ప్రజలకు తెలియాలి. విద్య, విద్యుత్, నీటి భద్రత, వ్యవసాయం, వైద్యం సహా వివిధ శాఖల్లో సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలపై భారం పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే... సంస్కరణల ద్వారా ప్రజలకు మేలు జరిగేలా చూస్తున్నాం. పీపీఏలను రద్దు చేసి గత ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ప్రజా ధనం దుర్వినియోగం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో బహిరంగ మార్కెట్ లో యూనిట్ విద్యుత్ ను రూ.5.19 చొప్పున కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు దానిని రూ.4.92కు తగ్గించాం. మొత్తంగా రూ. 9 వేల కోట్ల మేర విద్యుత్ ఛార్జీలు పెంచుకోవడానికి ఈఆర్సీ అనుమతి ఇచ్చింది. కానీ దీని వల్ల ప్రజలపై భారం పడుతుంది. అందువల్ల ఈఆర్సీ సూచనల అమల ఆలోచన చేయడం లేదు. ప్రజలపై భారం వేయకూడదని నిర్ణయించాం. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం. ఐదేళ్లల్లో విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4కు తగ్గించేలా కృషి చేస్తున్నాం. అందరం కలిసి సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశాం. ఒక్క పెన్షన్లలోనే ఇప్పటి వరకు రూ. 50 వేల కోట్లకు పైగా పేదలకు పంపిణీ చేశాం. ఏపీ బ్రాండ్ అనేది చాలా స్ట్రాంగ్ బ్రాండ్. గత పాలకుల వల్ల ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీ బ్రాండ్ తిరిగి తీసుకురాగలిగాం. విశాఖ సదస్సులో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. మన యువతకు ఉద్యోగాలు కూడా వస్తాయి. ఎప్పటికప్పుడు ఎస్ఐపీబీలు పెట్టుకుని పెట్టుబడులకు ఆమోదం తెలుపుతున్నాం. మొదటి త్రైమాసికంలో 12.02 శాతం గ్రోత్ రేట్ వచ్చింది. రెండో త్రైమాసికంలో 11.28 శాతం వృద్ధి నమోదు అయ్యింది. 8.70 శాతం జాతీయ సగటు కంటే ఎక్కువ ప్రగతి సాధించగలిగాం. ఇక భవిష్యత్ కాలానికి 17.11 శాతం లక్ష్యంగా పెట్టుకున్నాం. నీటి భద్రత విషయంలో ముందు చూపుతో పని చేశాం. సాగు నీటి ప్రాజెక్టుల్లో 944 టీఎంసీల నిల్వ చేసుకున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**అధికారుల ఆలోచనా విధానం మారాలి**

"ఉన్నతాధికారులంతా శాస్త్రీయంగా ఆలోచన చేసి అభివృద్ధికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. నిధుల లభ్యత తక్కువగా ఉన్నా... అభివృద్ధి పనులు ఆగకుండా చూడాలి. ఈ విధంగా చేయాలంటే అధికారులు వినూత్నంగా ఆలోచన చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాన్ని జోన్లుగా, రీజియన్లుగా, కారిడార్లుగా, క్లస్టర్లుగా హబ్ లుగా విభజించుకుని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. అన్ని శాఖలు, అన్ని ప్రభుత్వ సేవల్లో ప్రజల్లో సంతృప్త స్థాయిని నమోదు చేస్తున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలతో చక్కగా వ్యవహరించాలి. టీటీడీ పనితీరు మెరుగు అవుతోంది. కానీ దేవదాయ శాఖ పని తీరు మెరుగు పడడం లేదు. అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలి. జనవరి 15 నాటికి అన్ని సేవలూ ఆన్ లైన్లో సేవలందించే పరిస్థితి రావాలి."అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# అమెరికా భద్రతకే ముప్పు : ట్రంప్

వందల బిలియన్ డాలర్లు సృష్టించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తాను చేసే మరిన్ని అద్భుతాలను చూస్తారని వెల్లడించారు. తనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఏదైనా నిర్ణయం తీసుకుంటే అమెరికాకు ఆర్థిక రక్షణ లేకుండా పోతుందని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర దేశాలు తమ దేశం విషయంలో ఎలా అయితే ప్రవర్తిస్తున్నాయో తాము కూడా అలాగే బదులు చెబుతామని.. ఆ విధంగా ప్రవర్తించొద్దంటూ తమను ఎవరూ అడ్డుకోవద్దని వ్యాఖ్యానించారు. తమతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై సుంకాలు అమలు చేయడం వల్ల అమెరికా జాతీయ భద్రత మెరుగుపడిందన్నారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికార చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాలతో (%ఱతీబఎజూ ఖతీఱటటం%) విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ చట్టాన్ని వినియోగించే క్రమంలో అధ్యక్షుడు ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు రావడంతో ట్రంప్ నిర్ణయాన్ని కొన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఈ విషయంపై విచారణ కొనసాగుతోంది.

# మీ డబ్బు.. మీ హక్కు...

ప్రారంభించినట్లు చెప్పారు. "మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయి" అని ప్రధానితన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు , బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ , సెబీ , ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్‌క్లెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.

### ప్రమోషన్ల ఆనందం

# ప్రజలకు అందించే సేవల్లో కనబడాలి

వ్యవహారాన్ని బలంగా, పారదర్శకంగా ముందుకు తీసుకువెళ్లామ'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం ప్రమోషన్లతో మీరు ఎంత సంబరపడ్డారో.. మీరు అందించే సేవల ద్వారా ప్రజలు కూడా అంతే ఆనందపడాలన్నారు. ప్రజలకు సేవలు అందించే క్రమంలో మీరంతా నిష్పక్షపాతంగా, నిబద్ధతతో వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఏడాదిన్నర పాలనలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో ఎన్నో నూతన సంస్కరణలు అమలు చేశాం.. మరిన్ని అమలు చేయబోతున్నామన్నారు. చట్టబద్ధంగా మీకు చేయగలిగినవన్నీ చేస్తామని తెలిపారు. ఉద్యోగుల భద్రత, హక్కుల పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పెండింగ్ ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. బుధవారం మంగళగిరిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఇంజినీరింగ్ విభాగం, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బందితో మాటా మంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పల్లెలు బాగుంటే దేశం బాగుంటుంది. అందుకే గ్రామాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పంచాయతీరాజ్ శాఖను ఎంచుకున్నా. అనుభవం ఉన్న అధికారి పర్యవేక్షణ కావాలని శ్రీ శశిభూషణ్ కుమార్ గారిని ప్రధాన కార్యదర్శిగా తీసుకున్నాం. ఉపముఖ్యమంత్రి హోదాలో ఎక్కడా నా సొంత తెలివితేటలు వాడలేదు. కొన్ని సందర్భాల్లో నిర్ణయం తీసుకుంటే తప్పు తీసుకోకుంటే ఒప్పు అన్న పరిస్థితులు ఎదురయ్యాయి. అందుకే నా పని నేను చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను. శ్రీ శశిభూషణ్ కుమార్, శ్రీ కృష్ణతేజ, శ్రీ వెంకటకృష్ణ లాంటి నిబద్ధతతో పని చేసే బలమైన అధికారులు నాతో ఉన్నారు. వారి అనుభవంతో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చాం. గత ప్రభుత్వ పాలనలో చాలా అంశాల్లో పారదర్శకత లేదన్న విషయాన్ని వీరు నా దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు అభివృద్ధి చేయలేదు. కనీస మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించలేదు. ప్రతి పోస్టుకీ, బదిలీకి ఒక రేటు కార్డు ఉండేది. ఇలాంటి పరిస్థితులు పోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నా. మన వరకు ఉద్యోగులకు ఎంత పారదర్శకంగా వ్యవహరించగలమనే ఆలోచన చేశాం

**పూర్తి పారదర్శకంగా పదోన్నతులు**

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఔట్ సోర్సింగ్ తో కలిపి సుమారు రెండు లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. వీరికి పదోన్నతులు కల్పించే వ్యవహారంలో కార్యాలయ అధికారులు వెన్నెముకలా నిలిచారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వ్యవస్థ ప్రక్షాళణకు సంస్కరణలు అవసరం అని వారు చెప్పేవారు. సమీక్షల సమయంలో చిన్న చిన్న మార్పులు తీసుకురావడం ద్వారా మంచి ఫలితాలు సాధించాం. పదోన్నతుల వ్యవహారంలో నేను కల్పించుకోను అని ముందే చెప్పా. అయితే పాదర్శకతతో కూడిన పాలన కావాలని మాత్రమే కోరుకున్నా. సీనియారిటీ, సిన్సియారిటీ ఆధారంగా నివేదికలు ఇవ్వాలని సూచించా. బదిలీలు, పదోన్నతులపై ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు లెటర్లు ఇచ్చారు. సిఫార్సు పొందిన ఉద్యోగికి నిర్దేశిత ప్రమాణాలకు తగ్గ అర్హత ఉంటేనే దాన్ని ఆమోదించాలని స్పష్టంగా చెప్పాం.

**ఆర్థిక వ్యవస్థ గాడినపడితే ఉద్యోగుల ఆకాంక్షలు తీరుతాయి**

ఈ రోజున మనం 10 వేల మంది పైచిలుకు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా పదోన్నతుల వ్యవహారంలో ఇంత భారీ స్థాయిలో సంస్కరణలు అమలు చేయలేదు. నేడు పూర్తి పాదర్శకంగా మీకు పదోన్నతులు కల్పించాం. మేము ఎంత పాదర్శకంగా నిలబడ్డామో అదే స్ఫూర్తిని మీరు గ్రామాల్లోనూ ముందుకు తీసుకువెళ్లాలని కోరుకుంటున్నాం. ప్రతి ఒక్కరు సంపద పెంచిన తర్వాత హక్కులు, జీతాల పెంపు గురించి మాట్లాడాలి. ఆర్థిక వ్యవస్థ గాడిన పడకుండా అన్నీ ఒకేసారి చేయలేమన్న విషయాన్ని గుర్తించాలి. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నాం. అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తున్నాం. ఇప్పుడు సంస్కరణల ద్వారా పదోన్నతులు ఎలా వచ్చాయో అంతా చూశారు. గతంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పదోన్నతుల వ్యవహారంలో అనేక సమస్యలు ఉండేవి. వి.డి.ఒ.లుగా నియమితులైన వారు అదే పోస్టులో పదవీ విరమణ పొందిన సందర్భాలు ఉన్నాయి. గ్రూప్ 1 ద్వారా ఎం.పి.డి.ఒ. గా నియమితులైన వారికి 22 ఏళ్ల పాటు పదోన్నతి లేని పరిస్థితి. దీంతో పని పట్ల అధికారుల్లో కొంత మేర నిర్లిప్తత ఉండేది. దీన్ని పోగొట్టేందుకు చట్టబద్ధంగా అవకాశం ఉన్నంత వరకు సంస్కరణలు తీసుకువచ్చాం. గ్రూప్ 1 ద్వారా ఎం.పి.డి.ఒ. స్థానంలో నేరుగా డి.డి.ఒ.లుగా ఎంపికయ్యే వెసులుబాటు కల్పించాం.

ప్రమోషన్ల వ్యవహారంలో ఉమ్మడి రాష్ట్రంలో కూడా అమలు చేయని నిర్ణయాలను మన ప్రభుత్వం అమలు చేస్తుంది. గతంలో జిల్లా పరిషత్ సీఈవో స్థాయిలో ప్రమోషన్లు చాలా తక్కువగా ఉండేవి. ఇప్పుడు ఆ స్థాయిలో కూడా తొలిసారి 70 మందికి ప్రమోషన్లు ఇవ్వబోతున్నాం. ఇంజినీరింగ్ విభాగంలో ఇ.ఎన్.సి. స్థాయి అధికారిగా కూడా డిప్యూటీ ఇంజినీరు, ఎగ్జికూటివ్ ఇంజినీరు పోస్టుల్లో ఉన్న అధికారులే బాధ్యతలు నిర్వర్తించేవారు. మన ప్రభుత్వం వచ్చాక ఇ.ఎన్.సి. స్థాయికి కూడా రెగ్యులర్ ప్రమోషన్లు ఇస్తూ పదోన్నతులు కల్పిస్తున్నాం.

**సంస్కరణలతో పల్లెల్లో పట్టణ స్థాయి అభివృద్ధి**

గ్రామాల అభివృద్ధి ప్రక్రియలో భాగంగా ఎన్నో సంస్కరణలు అమలు చేశాం. పంచాయతీల అధికారాలు పంచాయతీలకు బదిలీ చేసే ప్రక్రియలో భాగంగా గతంలో ఉన్న క్లస్టర్ వ్యవస్థను రద్దు చేశాం. 13,350 గ్రామ పంచాయతీలను స్వతంత్ర పాలనా యూనిట్లుగా మార్చాం. జనాభా ప్రాతిపదికన నాలుగు గ్రేడ్లుగా విభజించాం. క్లస్టర్ వ్యవస్థలో మూడు, నాలుగు పంచాయతీలకు ఒక గ్రామ కార్యదర్శి విధులు నిర్వహించే వారు. నూతన విధానంతో గ్రేడ్ల వారీగా విభజించబడిన ప్రతి పంచాయతీకి ఒక పంచాయతీ సెక్రటరీని నియమించాం. తద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు మరింత సులభతరం అవుతాయి. అలాగే పంచాయతీ కార్యదర్శి పేరును గ్రామ అభివృద్ధి అధికారి (విలేజ్ డెవలప్ మెంట్ ఆఫీసర్) గా మార్చాము. 10 వేల జనాభా దాటిన గ్రామ పంచాయతీలను మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి కలలను సాకారం చేసే దిశగా రూర్బన్ పంచాయతీలుగా గుర్తించాం. డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి గెజిటెడ్ అధికారిని నియమించి మున్సిపాలిటీలతో సమాన అభివృద్ధి చేపట్టేలా చర్యలు తీసుకున్నాం.

**పని చేసే పరిస్థితుల్లో మార్పు తెచ్చాం**

73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తితో గ్రామ స్థాయిలో పాలనను సులభతరం చేసే ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 77 డి.డి.ఒ. కార్యాలయాలు ప్రారంభించాం. గతంలో ఎంపీడీఓ కార్యాలయాల్లో ఓ మూలన కూర్చుని విధులు నిర్వహించుకునే పరిస్థితి నుంచి పూర్తి స్థాయి సిబ్బందితో ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేశాం. ఈ కార్యాలయాల్లో ఆర్డీఓ స్థాయి అధికారిని నియమించి పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలోని అన్ని విభాగాల డివిజినల్ అధికారులు అయిన **DDO, DLPO, APD**(డ్వామా) మరియు ఇతర అధికారులు ఈ కార్యాలయం నుంచే సేవలు అందిస్తారు. పౌర సేవలు విస్తృతం చేసి ప్రజలకు చేరువయ్యేందుకు ఈ మార్గం దోహద పడుతుంది.

**మహిళా ఉద్యోగులను వేధిస్తే కఠిన చర్యలు**

దీంతోపాటు ఉద్యోగుల భద్రత, హక్కుల పరిరక్షణను వ్యక్తిగతంగా తీసుకుని ముందుకు తీసుకువెళ్తున్నాం. విధి నిర్వహణలో చిన్నపాటి ఉద్యోగికి ఇబ్బంది వచ్చినా అండగా నిలుస్తాం. మహిళా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడే వారిపై బలమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. రాజకీయ పరమైనదాడులను ఉపేక్షించం. అలాగే ఉద్యోగుల భద్రత, వారి హక్కుల పరిరక్షణ బాధ్యతను భుజస్కందాలపైకి ఎత్తుకున్నాం. ఉమ్మడి కడప జిల్లా, గాలివీడు ఎంపీడీఓ ఆల్ఫ్రెడ్ జవహర్ బాబు గారిపై ఓ పార్టీ వారు దాడి చేసినప్పుడు స్వయంగా వెళ్లి అండగా నిలిచాం. మా పర్యవేక్షణలో ఉన్న శాఖల ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తోడుగా ఉంటాం.పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఉద్యోగులంతా ఒక వ్యవస్థగా పని చేయాలి. ప్రజలకు సేవలు అందించే ప్రక్రియలో మీవంతు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. నేను జవాబుదారీతనంతో ఉంటాను. మీరు తప్పు చేయొద్దు" అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ కమిషనర్ ముత్యాల రాజు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, ఇంజినీరింగ్ విభాగం చీఫ్‌లు బాలూ నాయక్, గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

### 58,204 మంది అంగన్వాడీ వర్కర్లకు

# రూ.75 కోట్లతో సెల్ ఫోన్లు

పంపిణీ చేసామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 4 జి ఫోన్ లు సరిగ్గా పనిచేయలేదని, అందుకే కూటమి ప్రభుత్వం 5 జి నెట్ వర్క్ తో ఫోన్ లు అందించామన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 55,204 అంగన్వాడీ కేంద్రాల్లో దాదాపు లక్షా 25 వేల మంది సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు సచివాలయంలో శాఖల, మంత్రులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వివిధ శాఖల ర్యాంకులు ప్రకటించగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర స్థాయిలో 98 శాతం సేవలతో ఏoం కేటగిరి తో నాలుగో స్థానంలో నిలవటం అభినందనీయమన్నారు. దీన్ని నూరు శాతం సాధించే దిశగా ఉద్యోగులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ర్యాంకింగ్ లో చివరి స్థాయిలో ఉండగా నేడు నాలుగో స్థాయికి తీసుకురావడం వెనుక ఉద్యోగులందరి సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. గ్రామాల్లో తల్లిండ్రులు తమ చిన్నారులను నమ్మకం, ధైర్యం, విశ్వాసంతో అంగన్వాడీలకు పంపిస్తున్నారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా లో అంగన్వాడీ సెంటర్స్ లో పిల్లలను అందంగా తయారు చేయటానికి (పిల్లలను అందంగా అలంకరించటానికి) ముస్తాబు అనే ఒక కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించి మంచి ఫలితాలు సాధించిన తర్వాత ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాలంలోనే 3 సార్లు రూ. 1200 నుంచి రూ. 2,200 తిరిగి ఎన్ని ఆర్థికి ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ. 11,500 వరకు వేతనాలు పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు కూడా ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై త్వరలో సానుకూల నిర్ణయం ఉంటుందన్నారు. 7 వేల అంగన్వాడీల్లో 5 వేల మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, మిగిలిన అంగన్వాడీలలో ఉన్న టీచర్లకు 10 తరగతి అర్హత వచ్చిన అనంతరం మెయిన్ అంగన్వాడీలుగా చేస్తామన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లో పనిచేసే సిబ్బందిని అన్ని విధాల ఆదుకుంటున్నామని ఆర్థికంగా మీకు ఏం కావాలంటే అది చేయటానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని అయినప్పటికీ ఊరికే రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు, నిరసనలు చేయడం తగదన్నారు. యాప్ లు తగ్గించమని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. త్వరలో మీకు కొత్త యూనిఫాం చీరలు అందిస్తామన్నారు. ప్రతీ అంగన్వాడీ సెంటర్ కు మౌలిక వసతుల కల్పనకు లక్ష రూపాయలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని అదేసమయంలో శాఖాభివృద్ధికి కూడా మీరు సహకరిస్తారని ఆశిస్తున్నామన్నారు. అంగన్వాడీ ఆయాల జీతాల పెంపుపై కూడా దృష్టి సారించామని మంత్రి తెలియజేశారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం కార్యదర్శి ఏ. సూర్య కుమారి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అంగన్వాడీలకు వచ్చే వారి శాతం 70 శాతం ఉండగా, రాష్ట్రంలో 96 శాతంగా ఉండటం అంగన్వాడీల పనితనానికి నిదర్శనమన్నారు. అనంతరం బాల్య వివాహ రహిత ఏపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం శాఖ సంచాలకులు ఎం. వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ కే. ప్రవీణా, జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా భేగం, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లు, బ్లాక్ ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

### రూ.వందల కోట్లు దోచుకొని

# చిన్న దొంగతనం అంటావా..

వాస్తవం. ఒక్కసారి గతానికి వెళ్తే.. వీళ్లు కేసులను ఎలా తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశారో అందరికీ తెలుస్తుంది. వైఎస్ వివేకా, పరిటాల రవి కేసుల్లో సాక్షులను హతమార్చారు. ఇప్పుడు కూడా అదే విధానం అమలు చేస్తున్నారు. ఎవరైతే వాస్తవాలను నిరూపించేందుకు ప్రయత్నం చేస్తారో.. వారందరినీ వేధించడం, భయపెట్టడం, అవసరమైతే హత్యలు చేస్తున్నారు" అని జ్యోతుల నెహ్రూ ఆరోపించారు.

### తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు..

# 890 గ్రామాల్లో ఏకగ్రీవం : ఎస్ఈసీ

495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.

# పర్యాటక పురోగతి కూటమి ప్రభుత్వ లక్ష్యం

అందుబాటులో లేని పక్షంలో ప్రైవేట్ ల్యాండ్ అయినా కొని ప్రాజెక్ట్ లు ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. పర్యాటక వృద్ధి తమ అంతిమ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల నేపథ్యం, బ్యాక్ గ్రౌండ్, నెట్ వర్త్ తదితర అంశాలను ఆరా తీశారు. అన్ని డాకుమెంట్స్ సిద్ధం చేసుకుంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ లో ముందుకు వెళ్దామని పేర్కొన్నారు. కేబినెట్ లో అనుమతులు పొందిన అనంతరం ప్రాజెక్ట్ లు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారుల స్పందనపై ఇన్వెస్టర్లు ప్రశంసించారు.. తమకు పర్యాటక శాఖ అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమావేశాలు నిర్వహించడం వల్ల పర్యాటక శాఖతో సమన్వయంతో పాటు తమకు ఉపయోగకరంగా ఉందని అన్నారు. సమావేశంలో టూరిజం శాఖ ఈడీ (ప్రాజెక్ట్స్) శేషగిరిరావు, ఏపీ టూరిజం అథారిటీ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, కన్సల్టెంట్ సత్యప్రభ, హన్వికా బిజ్ క్రాఫ్ట్, సన్ క్యాస్టిల్, నాంది, హయాగ్రీవ హెూటల్స్, రజత్ ఇంటర్నేషనల్, చైతన్య గ్రూప్, త్రయివింగ్ వెకేషన్ రీట్రీట్స్, కే. ఎస్. ఎన్ కన్స్ట్రక్షన్, వీరాంజనేయ రిసార్ట్స్, సూర్య నమస్కార, జలవిహార్ రిసార్ట్స్, అరక్ పవర్ పైనీర్, సన్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్, ఓం శ్రీ భావన సాయి, బ్రహ్మరాథ, ఎలిక్సిర్ ఎంటర్ ప్రైసెస్ అండ్ హెూటల్స్, రిసార్ట్స్, సైవెన్ హాస్పిటలిటీ గ్రూప్, ఎన్ ఎం ఆర్ ఫిల్మ్ సిటీ, తత్వవనం ప్రైవేట్ లిమిటెడ్, అబ్ సింకా హెూటల్స్, పీవీ ఆర్, కేబీ ఆర్ హాస్పిటాలిటీ అండ్ రిసార్ట్స్, వరుణ్, రాపిడో, జీఆర్టీ హెూటల్స్ తదితర 30కిపైగా సంస్థల నుండి ఔత్సాహిక ఇన్వెస్టర్లు పాల్గొన్నారు.

### వ్యవసాయ యాంత్రీకరణకు

# అగ్రికల్చర్ ఎక్విప్మెంట్ బ్యాంక్

**పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులపై సీసీఐపై సీఎం అసహనం**

**ఉద్యాన పంటల కొనుగోలుదారులతో త్వరలో సమావేశం**

**ధాన్యం, పత్తి, మిరప కొనుగోళ్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యవసాయానికి అవసరమైన ఆధునిక సాగు యంత్ర పరికరాల కోసం అగ్రికల్చర్ ఎక్విప్మెంట్ బ్యాంక్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సాగు వ్యయం తగ్గేలా ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తేవాలని వ్యవసాయ శాఖకు సీఎం దిశానిర్దేశం చేశారు. బుధవారం సచివాలయంలో ధాన్యం, పత్తి, మిర్చి సహా వివిధ వాణిజ్య పంటల కొనుగోళ్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. శాస్త్రీయ విధానంలో పంటల సాగు ప్రణాళిక, వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గించాలని తద్వారా రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఓ వెబ్ సైట్ ను ప్రారంభించి పరికరాల వివరాలు తెలిపేలా సమాచారం ఉంచాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోళ్లతో పాటు వివిధ పంటల కొనుగోళ్లు, మార్కెటింగ్ పై సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు, వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు లక్ష్యంగా పెట్టుకున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఇప్పటి వరకూ 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. మొత్తం 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని.. 7.39 కోట్ల గోనె సంచులు కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్టు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే రూ.4,085 కోట్ల మేర రైతులకు చెల్లింపులు చేసినట్టు సీఎంకు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 32 శాతం అధికంగా కొనుగోళ్లు జరిగినట్టు తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎన్డీఏ ప్రజాప్రతినిధులు అంతా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా నిలబడాలని సూచించారు. రబీ సీజన్ లో ప్రజలు తినే వెరైటీ వరి సాగుతో పాటు వాటి కొనుగోలు, అంతర్జాతీయంగా మార్కెటింగ్ పై దృష్టి పెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రాగులు, జొన్న, సజ్జ లాంటి చిరు ధాన్యాల పంటలను సేకరించి వినియోగదారులకు అందుబాటులో ఉంచాలన్నారు.

**పత్తి కొనుగోళ్లపై కేంద్రానికి లేఖ**

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన స్లాట్లు కేటాయింపు, ఇతర సాంకేతిక సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి పత్తి కొనుగోళ్లలో సమస్యల్ని సృష్టించొద్దని సీసీఐకి సూచించారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి కేంద్రానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. మిర్చి లాంటి పంటలకు మార్కెట్ కల్పించే విషయంలో వివిధ విశ్లేషణా సంస్థలతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం మార్కెట్ కు అనుగుణంగా సుబాబుల్ రైతులకు ధర దక్కేలా చూడాలని సీఎం సూచనలు జారీ చేశారు. అరటి, నిమ్మ లాంటి ఉద్యాన పంటలకు సంబంధించి కొనుగోలు దారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి పంటకు నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహా ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

వైద్యాధికారులు బాధ్యతగా

## అప్రమత్తతో పనిచేయాలి : కలెక్టర్ షణ్మోహన్ సగిలి

**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద సమావేశ మందిరంలో వైద్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైద్య శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. కాకినాడ జిల్లాలోని అన్ని పి.హెచ్.సి / యు.పి.హెచ్.సి వైద్యాధికారులు స్క్రబ్ టైఫస్ వ్యాధి పై అప్రమత్తత, 24/7 పి.హెచ్.సి.లలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. ఈ నెల 21 తేదీన నిర్వహించే పల్స్ పోలియో పై సన్నద్ధత, పి.ఎం.జె.ఏ.వై సర్వే 100% అయ్యేలాగా చూడాలని, పి.ఎం.వి.వి.వై, ఎన్.సి.డి. 4.0 సర్వే, అసంక్రమిత వ్యాధులు ఆర్.సి.హెచ్, హెచ్.ఎం.ఐ.ఎస్, యు.విన్ పోర్టల్, ఎం.ఆర్. కాంపెయిన్ నేషనల్ డి.వార్మింగ్ డే, టి.బి., లెప్రసీ కేసులు, సీజనల్ వ్యాధులు, సైబర్ నేరాలకు సంబంధించి ఒ.టి.పి హెచ్చరికల గురుంచి మరియు ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు ఏవిధంగా జరుగుచున్నాయో తెలుసుకొని అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. ఎప్పటికప్పుడు అన్ని యాప్ లలో వివరాలు నమోదు చేయుటను పరిశిలించి నూటికి నూరు శాతం అమలు



అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమాల అమలుకు సిబ్బంది తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. జిల్లాలో ఫీల్డ్ లెవెల్లో ఆశ కార్యకర్తల యొక్క చేయు విధులను గురించి మరియు ఈ ఆశా యాప్ లో అప్లోడ్ చేయవలసిన,ఈ.సి విజిట్స్,హెచ్.బి.ఎన్.సి. విజిట్స్,ఐ.ఎఫ్ ఏ విటమిన్ అడ్మినిస్ట్రేషన్ వి.హెచ్.ఎస్.ఎన్.డి, వి.హెచ్.ఎస్.ఎన్.సి విధులు నమోదు గురుంచి సమీక్షా సమావేశంలో చర్చించి మరిన్ని సూచనలు చేసి జిల్లాలో మాతృ మరణాలపై, శిశు వుమరణాలు తగ్గించే దిశగా నివారణ చర్యలు ఎలా చేపట్టాలో తెలియజేసినారు. మాతృ మరణాలు అరికట్టుటలో కమ్యూనిటీ స్థాయి మరియు ఫెసిలిటీ లెవెల్ లో తీసుకోవలసిన మెజర్స్ గురుంచి సూచనలు ఇవ్వడం జరిగినది. ప్రమాదకరమైన పరిస్థితులలో వున్న గర్భవతులు తీసుకోవలసిన జాగ్రత్రలు గురించి, గర్భ సమయంలో అన్నీ పరీక్షలు, ప్రమాదకర గర్భిణీ స్త్రీలను గుర్తించి సకాలంలో సంబంధిత ఆసుపత్రికి మెరుగైన ప్రసవ సేవల గురుంచి తీసుకోవలసిన జాగ్రత్తల గురుంచి, ఆసుపత్రి ప్రసవాలు పెంచేలా చర్యలు తీసుకొవాలని, ఏదైనా ఫీల్డ్ లెవెల్ లో సమాచారం తెలిసినప్పుడు వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలి. యు.పి.హెచ్.సి, రామారావు పేట,ప్రతాప్ నగర్, హెల్త్ వెల్ సెంటర్ పెద్దబ్రహ్మ దేవం 1, 2, నేమం, ఏరియా హాస్పిటల్ తుని చిన్న పిల్లల విభాగానికి జాతీయ ఆరోగ్య నాణ్యత ప్రమాణాలు విభాగానికి సంబందించి ఉత్తమ ప్రశంస పత్రాలను వారందరికి ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ , డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ మహేశ్వర రావు, డి.ఎల్.టి.ఒ డాక్టర్ చలమయ్య, జిల్లా ఇమ్మ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కె.వి. సుబ్బరాజు, ఎన్.సి.డి. & ఆర్.బి.ఎస్.కె. డాక్టర్ వి.అరుణ డి.పి.ఎం.ఒ, డాక్టర్జి.లక్ష్మి, పెద్దాపురం డివిజన్ సూపర్విజింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.ప్రశాంతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.దేవ కుమారి, డిప్యూటీ డెమో కె.సూర్యచంద్రరావు, మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్య ద్వారానే సమాజంలో గౌరవం.. సముచిత స్థానం..

**చిక్కం సత్తిరాజు మెమోరియల్ జూనియర్ కళాశాల రజతోత్సవం వేడుకల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఛైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వరరావు**

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉన్నత విద్య ద్వారానే సమాజంలో సముచిత స్థానం, అరుదైన గౌరవం లభిస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆడపిల్లలకు అసలైన సౌందర్యం విద్య ద్వారానే కలుగుతుందని, విద్యద్వారా లభించిన గౌరవం, హెూదా ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలోని శ్రీ చిక్కం సత్తిరాజు మెమోరియల్ జూనియర్ కళాశాల 25 వసంతాల రజతోత్సవ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. చిక్కం సత్తిరాజు జూనియర్ కాలేజ్ అండ్ అన్నదాన సత్రం, ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ చిక్కం ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ సోంబాబు, జనసేన నాయకుడు చిక్కం భీముడు తదితర నాయకులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ గొల్లవిల్లి లాంటి గ్రామీణ ప్రాంతంలో 25 ఏళ్ల క్రితం చిక్కం, మోటూరి కుటుంబ సభ్యులతో పాటు ఎన్. కొత్తపల్లి కు చెందిన మునసబు రాజు, పొత్తూరు వెంకట



పతి రాజు, నడింపల్లి సూర్య నారాయణ రాజు కుటుంబాల దాతృత్వంలో విద్యాసంస్థను నెలకొల్పి నేటికీ పేద వర్గాల పిల్లల అభ్యున్నతి కోసం కృషిచేయడం అభినందనీయం అన్నారు. ఈ సంస్థ నానాటికీ అభివృద్ధి చెంది ఇప్పుడు డిగ్రీ కళాశాలకు కూడా వచ్చిందని, త్వరలోనే ఈ సంస్థ ద్వారా అగ్రి కల్చర్ కళాశాల ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సంస్థకు సుమారు 30 ఎకరాల పైబడి వ్యవసాయ భూమి ఉన్నందున ఇక్కడ వ్యవసాయ కళాశాల తప్పకుండా లభిస్తుందన్నారు. అంతే కాకుండా తనను గవర్నింగ్ బాడీ మెంబర్గా ప్రాధాన్యతనిచ్చి గౌరవించారని, ఈ కళాశాల అభివృద్ధిలో తన వంతు కృషిని చేస్తానన్నారు. కళాశాలకు వెళ్లే రోడ్డు మార్గంకు నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. గత 25 ఏళ్లుగా వేలాది మంది పేద విద్యార్థులకు విద్యనందించిన ఏకైక సంస్థగా చిక్కం సత్తిరాజు జూనియర్ కాలేజీ నిలుస్తుందన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వరరావు ఎంతో పేరుగడించి, ఎంతో బిజీగా ఉన్నాకూడా సొంత ఊరిలో వారి పూర్వీకులు స్థాపించిన కళాశాలకోసం పరితపించడం అభినందనీయం అన్నారు. ఆయన సుమారు మూడు వేలకు పైగా కిడ్నీ ట్రాన్స్ప్లాంటేషన్ ఆపరేషన్లను దిగ్విజయంగా పూర్తిచేసిన వైద్యుడిగా పేరుందన్ని తెలిపారు. మెట్ల రమణబాబు మట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న ఇటువంటి విద్యాసంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇంకా ఇక్కడ అగ్రికల్చర్ కోర్సులు వచ్చేందుకు తమ వంతు కృషిచేస్తానన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ చిక్కం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఈ విద్యాసంస్థను తమ పూర్వీకులు స్థాపించారని తెలిపారు. అప్పటి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ సతీష్ చంద్రతోపాటు పలువురు అధికారులు కళాశాలకు ఎంతో సహకరించారన్నారు. నేటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి స్థాయి సహాయ సహకారాలను అందిస్తున్న క్రమంలోనే నేటికీ కళాశాల ద్వారా దిగ్విజయంగా విద్యనందిస్తున్నామన్నారు. అనంతరం కళాశాలలో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలను, జ్ఞాపికలను ఎమ్మెల్యే ఆనందరావు తదితర నాయకుల చేతులమీదుగా అందించారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.. ఈకార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అధికారి వెంకటజయలక్ష్మి, జనసేన నాయకులు నాగ మానస, చిక్కాల సతీష్, కరస్పాండెంట్, సెక్రటరీ చిక్కం రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తాళ్ల రవి, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు నాగుళ్లపల్లి రాజు, చిక్కం ఉమామహేశ్వరరావు, యాళ్ల సతీష్, చిక్కం వెంకటకృష్ణ, సలాది నాగరాజు, కోడి శివ, గనిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 12న టిడిపి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

క్రైస్తవులు భారీగా తరలిరావాలని నిర్వాహకుల విజ్ఞప్తి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 12వ తేదీన స్థానిక భారీ మార్కెట్ సెంటర్ లో ఉన్న ఎంఎస్ఆర్ గ్రౌండ్స్ లో భారీ ఎత్తున క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్టు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ వెల్లడించారు. ప్రతీ ఏటా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదిరెడ్డి కుటుంబం సహకారంతో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 12వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి జరిగే వేడుకలకు సిటీ నియోజకవర్గంలోని 42 డివిజన్ కమిటీలు, సభ్యులు, క్రైస్తవులు తరలి రావాలని విజ్ఞప్తి చేసారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితర టీడీపీ ముఖ్య నాయకులతో పాటు దైవజనులు కూడా పాల్గొంటారని వివరించారు. ఆదిరెడ్డి కుటుంబం క్రైస్తవులకు అండగా నిలబడటమే కాకుండా చర్చిల నిర్మాణం, పాస్టర్లకు కూడా సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. మనకు వలె మన పొరుగు వారిని ప్రేమించమని క్రీస్తు బోధించిన విధంగా ఆదిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో కుల, మతాలకు అతీతంగా ఈ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు మాట్లాడుతూ టీడీపీ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఈ ఏడాది ముందుగానే నిర్వహించడానికి నిర్ణయించారన్నారు. క్రీస్తు బోధించిన మానవతా విలువలను కొనసాగించాలనే లక్ష్యంతో టీడీపీ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలను అందరూ హాజరు కావాలని కోరారు. క్రైస్తవుల ప్రతినిధి చిర్రా ప్రకాశం మాట్లాడుతూ ఆదిరెడ్డి కుటుంబం ఎల్లప్పుడూ క్రైస్తవులకు అండగా నిలబడుతోందన్నారు. క్రిస్మస్ వేడుకలతో అందర్నీ ఒకచోట చేర్చి ఆత్మీయ విందు ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసారు. సమావేశంలో టీడీపీ నాయకులు మరుకుర్తి రవియాదవ్, చాపల చిన్నరాజు, సాల్మన్ రాజు, సుధాకర్, విల్సన్, సుందర్రావు, కోట్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ కనకదుర్గమ్మ అమ్మ వారిని దర్శించుకున్న లీలాకృష్ణ దంపతులు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మ వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. బుధవారం మధ్యాహ్నం వారి కుటుంబ సభ్యులతో కలిసి అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేగుళ్ళ లీలా కృష్ణ మాట్లాడుతూ విజయవాడ కనకదుర్గమ్మ వారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ, సంతోషాలతో వుండాలని మనస్పూర్తిగా ఆయన కోరుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.



## కోనసీమ నూతన డీఈవోగా నాగేశ్వరరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారిగా ఇప్పటి వరకూ భాద్యతలు నిర్వర్తించిన డాక్టర్ షేక్ సలీం బాషా గుంటూరు డీఈవోగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో నూతన డీఈవోగా పి.నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీఈవో గా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావును సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, ఎంవీవీ సత్యనారాయణ, డీఈవో కార్యాలయ ఏడీ నక్కా సురేష్ లు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాను విద్యాపరంగా అభివృద్ధి చేయడంలో కలిసి పనిచేద్దామని, పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా వాసంశెట్టి చినబాబు పుట్టినరోజు వేడుకలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** టిడిపి నాయకులు వాసంశెట్టి చినబాబు( రాష్ట్ర మంత్రి సుభాష్ చిన్నాన్న) పుట్టినరోజు వేడుకలు సందర్బంగా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ కుడిపూడి సూర్య నారాయణరావు, అభిమానులు, ఇంకా ఈ కార్యక్రమంలో చినబాబు సోదరుడు వాసంశెట్టి సత్యం. న్యాయవాది కుడుపూడి త్రినాధరావు.,దండుమేను రూపేష్, రాయుడు సత్య ఋషి, పలివెల శ్రీనివాస్. అనిశెట్టి ప్రకాష్, ముంగర ప్రసాద్, చప్పిడి శోభన్ బాబు, కుడిపూడి వెంకటేష్, మట్టపర్తి అచ్యుత్, చిన్న బాబు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని చినబాబు కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు.

అల్లవరం పోలీస్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేసిన

## అమలాపురం డిఎస్పి టిఎస్ఆర్కే ప్రసాద్



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం పోలీస్ స్టేషన్ రికార్డులను వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం అమలాపురం డిఎస్పి టి.ఎస్.ఆర్కె ప్రసాద్ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వాహనాలు నడిపే వారు హెల్మెట్ ఉపయోగించేలా వాహన దారులకు అవగాహన కల్పించాలని,ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాసింజర్లను ఎక్కించకుండా, వాహన ప్రమాదాలు జరగకుండా చర్యలు తెలుసుకోవాలని, గంజాయి, సైబర్ నేరాలు,డ్రగ్స్ వంటి వాటిపై ఉక్కుపదం మోపాలని ఎస్సై డి.సంపత్ కుమార్కి పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ డి.ప్రశాంత్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో, బుధవారం రెండవ రోజు అంత్యత వైభవంగా అర్చక స్వాములు పవిత్ర ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దంపతులు, ఆలయ కార్య నిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణమూర్తి దంపతులు, స్వామివారికి



పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి పవిత్ ఉత్సవాలు కనులారా తిలకించారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్రములకు పర్యగ్నికరణం, ఉత్సవమూర్తులకు స్నపనీతిరుమంజన, శాంతి హెూమములు, సాయంత్రం పవిత్రములు ఊరేగింపు, పంచశయ్యాధివాసం, పౌత్రము, సర్వదేవతా ఆహ్వానం, మహా శాంతి హోమములు, అనంతరం శ్రీస్వామి వారికి నీరాజన మంత్రపుష్పములు అర్చక స్వాములు వేద పండితులు వేదమంత్రాలతో ఘనంగా జరిపించారు. అనంతరం తీర్థప్రసాదములు భక్తులకు అందజేశారు.

## వాడపల్లి ఏడు వారాల వెంకన్నకు భక్తులు లక్ష విరాళం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు విరాళం అందజేశారు. హైదరాబాద్, బోరంపేట కు చెందిన కిలారు సోమశేఖర్, దివ్య తేజ దంపతులు కుటుంబ సభ్యులు కలిసి సుమారు1,11,111, రూపాయలు శ్రీ వెంకటేశ్వర స్వామి నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి విరాళంగా ఆలే అధికారులకు అందజేశారు. దాతలకు అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు వెంకటేశ్వర స్వామి చిత్రపటం అందజేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మధుర దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో మధుర దేవాన్ష్ మొదటి పుట్టినరోజు వేడుకలు బంధు మిత్రుల సమక్షంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మధుర సుధీర్, రామలక్ష్మిల చిన్న కుమారుడు మధుర దేవాన్ష్ మొదట సవత్సరం పుట్టినరోజు సందర్భంగా దేవాన్ష్తో కుటుంబస్తులు కేక్ కట్ చేయించారు. పలువురు బంధువులు దేవాన్ష్కు శుభాకాంక్షలు తెలియజేసారు.వచ్చిన వారు అందరికీ బోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో అధిక సంఖ్యలో కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## జనవాణిలో ప్రజా సమస్యలు స్వీకరించిన ఆర్డిఎస్ ప్రసాద్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు జనసేన పార్టీ చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జనవాణి' బుధవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జరిగింది. జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన పౌరులు తమ సమస్యలను, అభ్యర్థనలను ఇందులో వివరించారు.ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో పాటు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.డి.యస్. ప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వెంటనే పరిష్కారం అవసరమైన అంశాలను సంబంధిత విభాగాధికారులకు పంపించి చర్యలు తీసుకునేలా సూచించారు.ప్రజలకు ఎప్పుడైనా చేరువలో ఉంటూ సమస్యలు పరిష్కరించడం జనసేన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గ దేవస్థానం డైరెక్టర్ పద్మావతి అజయ్, లీగల్ సెల్ ప్రతినిధులు గుండు శ్రీనివాస్, కాకి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మాచవరంలో పలు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** నాణ్యత విషయంలో లోపం లేకుండా త్వరితగతిన పనులను పూర్తిచెయ్యాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, మాచవరం గ్రామంలో గల దేవుడు కాలనీలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులతో చేపడుతున్న సి.సి రోడ్లు, డ్రైన్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలో రాజీ పడక, వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తూ, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్సా నాగు, మాచవరం గ్రామ శాఖ టీడీపీ అధ్యక్షులు మేడపాటి రవీంద్రరెడ్డి, రొంగల సత్యనారాయణ, నల్లమిల్లి వెంకటరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, శెట్టి రవి, తీగిరెడ్డి ప్రశాంత్, పంచాయితీ రాజ్ ఎ.ఇ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు ఉన్నారు.



జిల్లా కలెక్టర్ని మర్యాద పూర్వకంగా కలిసిన

## జిల్లా విద్యాశాఖ అధికారిగా పడాల నాగేశ్వరరావు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా పడాల నాగేశ్వరరావు బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించి అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థకు దార్శనిక నాయకత్వం వహించి దిక్సూచిగా నిలుస్తూ విద్య వ్యాప్తి ద్వారా జిల్లా యొక్క పేరు ప్రఖ్యాతులు రాష్ట్ర స్థాయిలో ఇనుమడింప చేసేలా అందరి సమన్వ యంతో కృషి చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో విద్యా వ్యాప్తి ద్వారా ఎంతోమందినీ ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలని ఆ దిశగా ముందడుగు వేయాలని సూచించారు.

టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నుండి

# ఇన్సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించాలి



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి.యూ. టి.ఎఫ్.రాష్ట్ర అధ్యక్షులు, కె.ఎన్. వెంకటేశ్వర్లు.టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నుండి ఇన్సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించాలని, సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని కోరుతూ కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్ నుండి ఆర్‌డిఓ కార్యాలయం వరకు కొత్తపేట డివిజన్ స్థాయిలో ర్యాలీ నిర్వహించి ఆర్. డి. ఓ.కి మెమోరాండం అందచేయుట జరిగింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోధనేతార కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయం వృధా అవుతోందని, ఆన్లైన్ పనులు ఇప్పటికే బహిష్కరించుట జరిగిందని. ప్రభుత్వం వెంటనే స్పందించి స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని. లేకపోతే 18 వ తేదీ కలెక్టరేట్ ల ఎదుట భారీ నిరసన ప్రదర్శన చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్. జ్యోతి బసు, జిల్లా సహాధ్యక్షులు జి. వి. రమణ, కార్యదర్శులు వై. మురళి,పి. మురుగేశ్వరరావు, వై. బాలాజి,వి. రత్నం, కె. శ్రీనివాస్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు టి. విజయ కృష్ణ, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.శివకుమార్, జి.రామ్కుమార్, ఎన్.వి.వి.ప్రసాద్, డి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట...!



– స్పందించిన ఎటపాక రెవెన్యూ

ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ : మండల కేంద్రంలో గోదావరి కరకట్ట ప్రాంతాల్లో అనధికారికంగా కొందరు వ్యక్తులు ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసి అక్రమంగా రాత్రి పగలు తేడా లేకుండా యదేచ్ఛగా అక్రమంగా ఇసుకను తవ్వి తెలంగాణకు తరలించి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని వైకాపా రాష్ట్ర నాయకులు కురినాల వెంకట్ (బుజ్జి) ఆరోపిస్తూ పలు వాట్సాప్ గ్రూపుల్లో మంగళవారం వార్తలు వచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎటపాక రెవెన్యూ అధికారులు స్పందించారు. గోదావరి కరకట్ట ప్రాంతంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ర్యాంపులను ఎటపాక రెవెన్యూ ఇన్స్పెక్టర్ సందీప్ , వీఆర్వో రామ్మూర్తి బుధవారం పరిశీలించి ర్యాంపుకు వెళ్లి దారిలో జెసిబితో కందకాలు తవ్వించారు. దాంతో వైకాపా రాష్ట్ర నాయకులు కురినాల వెంకట్ (బుజ్జి) హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ సందీప్ , వీఆర్వో రామ్మూర్తి , వైకాపా యూత్ నాయకులు నరేష్ , కురినాల విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ



అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : అమలాపురం మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహం వద్ద బుధవారం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం పట్ల వైసిపి పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా కోటి సంతకాల సేకరణకు వచ్చిన పత్రాలను కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డికి అందజేశారు.. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ , నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, వైసీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముమ్మిడివరం మండపేట నియోజకవర్గాల పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు సిఈసి సభ్యురాలు చింతా అనురాధ ,మండల అధ్యక్షులు గుత్తుల చిరంజీవి, కేత భానుతేజ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సమాజ హితం ప్రకృతి వ్యవసాయం : విజయరామ్



కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : ఆరోగ్యకర ఆహార పదార్థాలను స్వీకరించడం ద్వారా మానవాళికి ఎన్నో ప్రయోజనాలను చేకూర్చే ప్రకృతి వ్యవసాయం పట్ల ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని. ఉభయ తెలుగు రాష్ట్రాల పద్మ శ్రీ సుభాష్ పాలేకర్ కృషి ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయరామ్ అన్నారు. కెప్టెన్ అజ్జరపు మల్లికార్జున్ రావు రాజేశ్వరి దంపతుల స్వీయ పర్యవేక్షణలో కాకినాడ జిల్లా రామేశ్వరంలోని హరిత రాగ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రకృతి రాగా వారి నేచురల్ బయో ఇన్పుట్ రిసోర్సెస్ సెంటర్‌ను ప్రకృతి వ్యవసాయ ప్రచారకర్త విజయరామ్ (హైదరాబాద్) ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ . కాకినాడ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏలియాజర్, రిసోర్స్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ శివచక్రం స్వీయ పర్యవేక్షణలో ఏర్పాటు అయిన ఈ కేంద్రం రైతులందరికీ అందుబాటులో ఉంటూ ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు .సుమారు 49 గ్రామాల ప్రజలకు ఈ కేంద్రం నుండి ప్రకృతి వ్యవసాయ విధానంతో పాటు ఆరోగ్యకర ఉత్పత్తు లకు అవసరమైన విజ్ఞానంతో పాటు ముడి పదార్థాలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి ఇన్పుట్స్ రిసోర్సెస్ సెంటర్స్‌ను ప్రతి మండల పరిధిలో ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో భాగంగా కాకినాడ జిల్లాలో రైతులకు అవసరమైన సెంటర్ ను ఏర్పాటుకు ప్రకృతి రాగ సంస్ప్రారంభించడం శుభ పరిణామమని విజయరామ్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రోత్సహించాలన్న ఆశయంతో అనేక రాయితీలను ప్రకటించడమే కాక జిల్లా స్థాయిలో వ్యవసాయ శాఖలో ప్రకృతి వ్యవసాయం కు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని విజయ రామ్ అన్నారు. క్షేత్రస్థాయిలో ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీ కి చెందిన అగ్రికల్చర్ స్టూడెంట్స్ తో కలిసి విజయ రామ్ చేసిన కార్యక్రమాలు గ్రామీణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ ప్రతినిధులతోపాటు ప్రకృతి రాగా సంస్థ ప్రతినిధుల బృందం సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ఫణీంద్ర, శివ సాయి కుమార్, బివిఎస్ నారాయణ, టి.శివ, జయ కుమార్, ఇంజనీర్ సాయి ప్రసాద్ ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజ్ అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి రాజు, కాలేజీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అటల్ - మోడీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయండి

కాకినాడ జిల్లా భా.జ.పా. పూర్వ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ పిలుపు



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : భారతదేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 11 నుంచి 25 వరకూ నిర్వహించనున్న అటల్ - మోడీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయాలని కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ జిల్లా జనులకు పిలుపును ఇచ్చారు. ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని రాంకుమార్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు.వాజ్ పేయి స్ఫూర్తిని యువతలో నింపేలా అటల్ సందేశ్ - మోదీ సుపరిపాలన యాత్ర తలపెట్టిన బీజేపీ కార్యవర్గానికి రామ్ కుమార్ అభినందనలు తెలిపారు. దేశంలో సుపరిపాలనకు నాంది పలికిన నాయకులు వాజ్ పేయీ అని అన్నారు. ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి పునాదులను వేసాయి అన్నారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వాజ్ పేయి దేశం గర్వించే నాయకులుగా ఎదిగారు అన్నారు. 9 సార్లు లోక్ సభకు, 2 సార్లు రాజ్యసభకు ఎన్నిక అయ్యారంటేనే ఆయన గొప్పతనం అర్థం చేసుకోవచ్చని అన్నారు. 18 ఏళ్ల వయసులోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న స్వతంత్ర సమర యోధులని కొనియాడారు. అంతే కాకుండా 1998లో పోఖ్రాన్2 అణు పరీక్షలను విజయవంతం జరిపి ప్రపంచానికి భారత శక్తిని చాటారు అన్నారు. కార్గిల్ యుద్ధంతో శత్రువుకు తిరుగులేని సమాధానం ఇచ్చారని చెప్పారు.? భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి ప్రధానిగా అటల్ స్వర్ణ చతుర్భుజితో పథకంలో చేపట్టిన హైవే ప్రాజెక్టు దేశం దశ దిశను మార్చేసింది అన్నారు. దేశంలో రవాణా సదుపాయాలను మరింత సులభతరం చేస్తూ ప్రయాణ సౌకర్య సమయాన్ని తగ్గించి, దేశ వ్యాపార రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపే విధంగా కృషి చేశారని, అలాగే వాజ్ పేయీ హయాంలోనే టెలీ కమ్యూనికేషన్, విమానయాన రంగాల్లో సంస్కరణలకు నాంది పలికారని వివరించారు. నాడు అణు పరీక్షలు అయినా, నేడు ఆపరేషన్ సింధూర్ అయినా, నాడు చతుర్భుజి అయినా, నేడు సాగరమాల అయినా అవి ఎన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని సీఎం తెలిపారు. ఈ యాత్రలో భాగంగా బైక్ ర్యాలీ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు, డప్పు వాయిద్యాలు, మహిళలు నిర్వహించే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో రాష్ట్రంలో పండుగ వాతావరణం నెల కొంటుందని చిలుకూరి పేర్కొన్నారు.

# ఆదివాసి గ్రామాలను 5వ షెడ్యూల్డు ప్రాంతంలో చేర్చాలి..

## హైకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ప్రభుత్వం తాత్సారం : అయినాపురపు సూర్య నారాయణ డిమాండ్



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 45 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 554 గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చి వారి హక్కులను కల్పించే వరకు ఆదివాసీ మహాసభ న్యాయ పోరాటం చేస్తుందని న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ స్పష్టం చేసారు.దీనిపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ప్రభుత్వం తీవ్రమైన తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీల హక్కులను మానవ హక్కులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేసారు. బుధవారం ది రాజమండ్రి ప్రెస్ క్లబ్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లడుతూ గిరిజనులు అధికంగా నివశించే గ్రామాలను 5వ షెడ్యూల్డు ప్రాంతంలో కలపాలనే సమస్యను పరిష్కరించాలని 2019లో అప్పటి గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పుష్ప శ్రీవాణి అధ్యక్షతన జరిగిన గిరిజన సలహా మండలి 2019లో తీర్మానించిందని గుర్తు చేసారు.ఇదే విషయమై 2019 నవంబర్ 4న మంత్రి ఉన్నత స్థాయి అధికారులతో ఆంధ్రప్రదేశ్లోని 5వ షెడ్యూల్లో కలపవలసిన 554 గ్రామాల జాబితా విషయమై చర్చించారన్నారు. ఇందులో కాకినాడ జిల్లాలోని శంఖవరం మండలంలోని 15 గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని 14 గ్రామాలు, రౌతులపూడి మండలంలో 11 గ్రామాలు మొత్తం 40 గ్రామాలు కూడా ఉన్నాయి. 2019లో రంపచోడవరం ఐ.టి.డి.ఎ. ప్రాజెక్టు అధికారి ఈ మేరకు పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారివారికి లేఖ వ్రాసారు. అనంతరం 3 గిరిజన సంఘాలు హైకోర్టులో రిట్ పిటీషన్ నెం.4957/2021 దాఖలు చేసారు. 2022 ఏప్రిల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా ఈ 40 గ్రామాలకు 5వ షెడ్యూలు ఫలాలు అందే విధంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఆదేశాలు అమలుకాకపోవడంతో ఇటీవల ఆదివాసి మహాసభ హైకోర్టులో రిట్ పిటీషన్ నెం.33189/2025 దాఖలు చేసింది. అనంతరం కాకినాడ జిల్లా కలెక్టరు సగిలి షాన్మోహన్ ఈ విషయమై తగిన చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారిని, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల తహశిల్దార్లును, మండల ప్రజాపరిషత్ అధికారులను ఈ నెల 2వ తేదీన ఆదేశించారన్నారు.. 1980వ సంవత్సరం నుండి ఈ సమస్య పెండింగ్లో ఉన్నది. కాకినాడ జిల్లాలోని ఈ 40 గ్రామాలను 1980లోనే 5వ షెడ్యూల్డు ప్రాంతంలో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపినా ఇప్పటికీ 5వ షెడ్యూలులో చేర్చలేదన్నారు. ఇదిలా ఉండగా, కాకినాడ జిల్లాలో 50 శాతం గిరిజన జనాభా మించి ఉన్న గ్రామాలు మరో 19 ఉన్నాయని వాటిని కూడా 5వ షెడ్యూలులో చేర్చాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. 5వ షెడ్యూల్లో కలపకపోవడం వలన ఆదివాసీలు భూమి పైన, వనరులు పైన హక్కులు పొందలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్ మెంబర్ జర్తా సరస్వతి, జీడెం నాగేశ్వరరావు, కాకర దేవీ వరప్రసాద్, జర్తా బాలరాజు,లోతా వెంకట రమణ,ఆవూరి అప్పారావు,రొబ్బాల శ్రీను, సిహెచ్ వెంకటరత్నం, జక్కల పాండవులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు

# టి.కే విశ్వేశ్వర్ రెడ్డి సహాయం



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : బుధవారం ఉదయం స్థానిక క్వారీ ప్రాంతంలో సుబ్బారావునగర్ హైస్కూల్ సమీపంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇళ్లకు స్పందించిన యజమానులు మార్తి మరియమ్మ, మార్తి కామరాజు, మార్తి చిన్న అను మూడు కుటుంబాల వారికి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరెడ్డి చే వంట సామాను, బియ్యం డబ్బా చాపలు, మంచం తదితర కుటుంబాలకు అవసరమైన సామానులను అందజేసారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బాలేపల్లి మురళి,బ్లాక్ అధ్యక్షులు బర్రె సుబ్రహ్మణ్యం, జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర్,నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు బత్తిని చంద్రావు, డిసిసి సెక్రెటరీ దయ్యాల రాజు, జిల్లా లేబర్ సెల్ అధ్యక్షులు దొంతుపల్లి రామ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీకే మాట్లాడుతూ ప్రభుత్వం వారు ఇంతవరకు ఏ రకమైన సహాయం అందించలేదని కనీసం రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు గానీ వార్డు సెక్రటరీ గాని వచ్చి పలకరించలేదని ప్రభుత్వం ఏ విధంగా పనిచేస్తుందో ఇదే నిదర్శనం అని తక్షణం వారికి ఇల్లు కట్టించవలసిన బాధ్యత ప్రభుత్వం ఉందని టి.కె డిమాండ్ చేసినారు. బాలెపల్లి మురళి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు మీకు అండదండగా ఉంటుందని తెలియజేసినారు.

జాతీయ రహదారులకు

# భూసేకరణ పనులు వేగవంతం చెయ్యండి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్




కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ : బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ కలిసి కాకినాడ రూరల్ వాకలపుడి నుంచి అన్నవరం వరకు నిర్మించిన జాతీయ రహదారి భూ సేకరణ పురోగతి, కాకినాడ సెజ్ భూములు రైతులు పేరున బదిలీ చేసే ప్రక్రియపై రెవెన్యూ, కెఎస్ఈజెడ్, ఎన్.హెచ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సేకరణ, సెజ్ భూములు వివరాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. కాకినాడ పోర్టును జాతీయ రహదారులకు అనుసంధానం చేసే ప్రక్రియలో భాగంగా వాకలపుడి నుంచి అన్నవరం వరకు నిర్మించిన జాతీయ రహదారికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. నిర్ణీత సమయంలోగా భూ సేకరణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా కాకినాడ జిల్లాలో యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఎస్ఈజెడ్ లిమిటెడ్ కింద కాకినాడ డివిజన్, పెద్దాపురం డివిజన్ పరిధిలో ప్రత్యామ్నాయ భూమి 259.040 ఎకరాలు, రైతులు వదిలేసిన భూమి 930.176 ఎకరాల భూమిని 1,545 మంది రైతులకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రెవెన్యూ, కెఎస్ఈజెడ్, శాఖల అధికారులు సమన్వయతో పనిచేసి, సెజ్ భూములను రైతుల పేరును బదిలీ చేసే ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లి బాబు, కె.శ్రీరమణి, ఎస్ఈజెడ్ ఎస్డీసీ ఎన్.శ్రీధర్, కాకినాడ సెజ్ జీఎం ఎం.శ్రీనివాసు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్కౌంటర్లపై నిజమెంత..

హిడ్మాను ఎన్కౌంటర్ చేయటం..కసబ్‌ను ఉరి తీయటంలో రాజకీయ ఆంతర్యం ఏమిటి !

మేడా శ్రీనివాస్ సందేహాలు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : నక్షలైట్ హిడ్మా భారత జాతీయ జెండాను గౌరవిస్తునే సాయుధ పోరాటంలో అమరులయ్యారు. ఓవైసీ పాకిస్తాన్ ఇస్లాం కు జై అంటూనే భారత జాతీయ గీతాన్ని అగౌరవ పరుస్తు భారత పార్లమెంట్ లో కీర్తింప బడుతున్నారు. నక్షలైట్ ఉద్యమం స్వదేశీ, విదేశీ, దోపిడి పాలనకు, బానిసత్వానికి వ్యతిరేకంగా పురుడు పోసుకుంది. ఉగ్రవాదం విదేశీ మత ఉన్మాదంను ప్రోత్సహిస్తుంది. మన పాలకులు మాత్రం ఉగ్రవాద పాకిస్తాన్‌తో శాంతి చర్చలు అంటారు. నక్షలైట్‌లను తుపాకీతో కాల్చి చంపేస్తుంటారు. ఆపరేషన్ సిందూర్ వంటి భారతదేశ భద్రతా దాడిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట విని ఆపేసారు. మరి ఆపరేషన్ కగార్‌ను ఎందుకు ఆపటం లేదు. ఎందుకు శాంతి చర్చలు జరుపటం లేదు. సామాన్య పౌరులను చంపుతున్న తీవ్రవాదులుతో చర్చలు జరుపుటకు ఆశక్తి చూపిస్తున్నారు.సమ న్యాయం అమలు చేయమని పోరాడుతున్న నక్షలైట్‌లను చంపి వేయటంలో మర్మం ఏమిటో సగటు భారతీయులకు అర్థం కావటం లేదు. ఎన్కౌంటర్లపై నిజమెంత! కేసుల స్పష్టతపై ఎంత మేరకు నిజం ఉంటుంది. భారతదేశానికి నక్షలైట్‌లతో ప్రమాదమా! తీవ్రవాదదులతో ప్రమాదమా! స్పష్టత ఇవ్వగల వేదిక మన ప్రభుత్వ వ్యవస్థలో ఉందంటారా! హక్కుల కోసం పోరాడే నక్షలైట్‌లు అడవిలో వుంటున్నారు. జాతీయ గీతాన్ని గౌరవించం అంటున్నవారు పార్లమెంట్ సాక్షిగా భారత్‌లో జిహాద్ ప్రకటిస్తాం అని ప్రకటించుకుంటున్న వారు భారతదేశ చట్ట సభల్లో గౌరవింపబడుతున్నారు. తీవ్రవాదానికి అనుకూలంగా పార్లమెంట్‌లో వాదిస్తున్న వారు ప్రజా ప్రతినిధులు అవుతున్నారు. హక్కులు కోసం మాట్లాడే నక్షలైట్ ప్రమాధికారి ఎలా అవుతారు..! ప్రశ్నినించే వారు ప్రజాస్వామ్యంలో ఉండకూడదా! ముంబై తాజ్ హోటల్‌లో మారణ కాండ సృష్టించిన కసబ్ ను చట్ట బద్దంగా విచారించి ఉరి తీసారు. విదేశీ ఉగ్రవాదులను చట్టభద్ధంగా శిక్షించటంలో జరుగుతున్న ప్రభుత్వ వైఖరిని పలువురు ప్రశ్నిస్తున్నారు. భారత ప్రజాస్వామ్యం ఎటు పోతుంది. విప్లవాన్ని ఎంకౌంటర్ చేయటం. ఉగ్రవాదాన్ని చట్ట బద్దంగా శిక్షించటంలో అర్థం ఏమిటి !మన రాజ్యాంగ భద్రత పట్ల సగటు భారతీయులు ఖచ్చితమైన సమాధానం కోసం ఎదురు చూస్తున్నారు.

# సాదాసీదాగా సీతానగరం మండల సర్వసభ్య సమావేశం



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : సీతానగరం మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు బుధవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అసంపూర్తిగా హాజరైన ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యకలాపాలను వివరించారు. మండల వైద్యాధికారి ఏవీకే చైతన్య మండలంలో ప్రజలకు అందిస్తున్న వైద్యం పట్ల సభ్యులకు వివరించారు. పామాయిల్ పెంపకం పట్ల ఉద్యాన శాఖ అధికారిపై నేతలు మండిపడ్డారు. పామాయిల్ వ్యవసాయంలో మాకు ఎవరూ సంబంధిత అవగాహన కల్పించడం లేదని అన్నారు. సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాలేదు. దాంతో సభా ప్రాంగణం కనీసం కుర్చీలు నిండని సందర్భం ఏర్పడింది. ఏ అధికారి ఏ పనులు నిర్వహించారో దేనికి ఎంత ఖర్చులు చేశారనేది ప్రశ్నార్ధకంగా మారింది. ప్రధాన అధికారులు హాజరుకాకుండా క్రింది స్థాయి సిబ్బందిని సర్వసభ్య సమావేశానికి పంపించడంతో తూ..తూ.. మంత్రంగా వారు ఏం చెప్పాలో అర్థం కాని సందర్భాలు సభ ప్రాంగణం నందు ఏర్పడ్డాయి. దాంతో ఎటువంటి చర్చ లేకపోవడంతో సభ సాదాసీదాగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం భారతి,తాసిల్దార్ అంకం శ్రీనివాస్,వైస్ ఎంపీపీ సత్యం మదన్మోహన్,జడ్పిటిసి చల్లమళ్ళ వెంకటలక్ష్మి, దేవదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి పాటి సత్యనారాయణ,పలువురు ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ వాలీబాల్ ప్లేయర్ రోజ్లికి ఆర్థిక సహాయం

– వాలీబాల్ ప్లేయర్ రోజ్లికి పితృవియోగం



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : ఇటీవల జరిగిన అండర్ 17 వాలీబాల్ జాతీయస్థాయి క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గాడాల జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని రోజ్లికు ఇటీవల పితృ వియోగం జరిగింది. బుధవారం గుమ్ము లూరు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో కోరుకొండ మండల జోన్ వ్యాయామ ఉపాధ్యాయులందరూ కలిసి 18వేల రూపాయలు ఆర్థిక సహాయం క్రీడాకారిణి రోజ్లికి ఆర్థిక సహాయాన్ని అందించారు. వ్యాయామ ఉపాధ్యాయులను అందరం భవిష్యత్తులో రోజ్లికి అన్ని విధాలుగా అండదండగా నిలుస్తూ, తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ లీడర్ ఏడి ప్రసాద్, మండల వ్యాయామ ఉపాధ్యాయుల కోఆర్డినేటర్ జగదీష్, గోకవరం మండల వ్యాయామ ఉపాధ్యాయుల గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ,మల్లికార్జున రావు, గణేష్, నాగేశ్వరరావు, కె సత్యనారాయణ, ఎం సత్యనారాయణ, జాకాబ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు బత్తుల చేతుల మీదుగా సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : కోరుకొండ మండలంలోని బుచ్చింపేట కాపవరం మునగాల కోటి బూరుగుపూడి మధురపూడి తదితర గ్రామాల్లో వైద్యం చేయించుకున్న బాధిత కుటుంబాలకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పరామర్శించి, ఆమె చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని బత్తుల సత్యవేణికి(బూరుగుపూడి) 40వేల రూపాయలు, బొండు రత్నం( మధురపూడి) 36వేల రూపాయలు, మండపాక గన్నెమ్మ (బుచ్చింపేట) 20వేల రూపాయలు, పచారి యశ్విక్ రామ్( కాపవరం) 40వేల రూపాయలు, మేడిశెట్టి యశ్వంత్( మునగాల) 20వేల రూపాయలు, చాకలి ధనబాబు( కోటి) 30వేల రూపాయలు చెక్కును బత్తుల చేతుల మీదేగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు అడ్డాల శ్రీను, ఎర్రంశెట్టి పోలారావు, అడపా వీరబాబు, జాజుల రాము, తెలగంశెట్టి శ్రీనివాస్, పచారి నరసింహమూర్తి, జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అవగాహన సదస్సులో

## సీఐ శేఖర్ బాబు, ఎస్సై రమణారెడ్డి



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలోని హై స్కూల్ విద్యార్థులకు హెల్మెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు రావులపాలెం సీఐ శేఖర్ బాబు, స్థానిక ఎస్సై రమణారెడ్డి, ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు హెల్మెట్,సైబర్ క్రైమ్, వివిధ అంశాలపై సూచనలు ఇచ్చారు. అలాగే విద్యార్థులను, ఆక్సిడెంట్, సైబర్ క్రైమ్ మీద వివరాలు అడిగి తెలుసుకున్నారు.1930, 100, 102,112, నెంబర్లపై అవగాహన ఈవ్టీజింగ్,సైబర్ క్రైమ్ బ్యాంక్ అకౌంట్ జరిగే మోసాల పైన, విద్యార్థులకు వివరించారు. వాట్సాప్ ద్వారా జరుగుతున్న మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రూ.13.71 కోట్లతో అభివృద్ధి

### నియోజకవర్గానికి 35 ఆరోగ్య కేంద్రాలు, 2 ఆరోగ్య యూనిట్లు : ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : దేశవ్యాప్తంగా అమలవుతున్న వైద్య, ఆరోగ్య, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా, రాష్ట్రంలో వైద్య సేవలు మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా కొత్తపేట నియోజకవర్గానికి 35 ఆరోగ్య కేంద్రాలు మరియు 2 ఆరోగ్య యూనిట్లు మంజూరు అయ్యాయి. ఈ మేరకు వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ ఎమ్మెల్యే బండారుకు లేఖ రాశారు. కొత్తపేట నియోజకవర్గంలో ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువలో ఉండేలా పలు ఆసుపత్రుల భవన నిర్మాణాలు జరుపుతున్నట్టు ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో రూ.13.71 కోట్లతో 35 ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి నిర్మాణాలు జరుపుతున్నట్టు, ఇందులో 35 విలేజ్ హెల్త్ క్లినిక్స్ 2 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ ఉన్నాయని తెలిపారు. ఈ నిర్మాణాలు పూర్తికాగానే స్థానిక ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

## దేవస్థానం బోర్డు డైరెక్టర్ ముత్యాల బాబికి ప్రశంస



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : కోనసీమ తిరపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా కాసా చాముండేశ్వరి సాగర్ జిల్లా, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జిని మర్యాద పూర్వకంగాకలవడం జరిగింది. కలిసినవారులో కాసా విజయసాగర్ బూసిభాస్కర్‌రావు ఎలిసెట్టి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

### పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో

## ఎంపీ హరీష్ బాలయోగి



అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : ఢిల్లీలోని పార్లమెంట్ సి–బ్లాక్‌లో జరిగిన కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ అధికారులతో మూడు ముఖ్య అంశాలపై సమీక్ష నిర్వహించారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పనితీరు, విదేశీ ఉపాధి కోసం సిద్ధమవుతున్న వలస కార్మికులకు అందిస్తున్న నైపుణ్య, భాషా శిక్షణ, అలాగే ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన పురోగతి గురించి చర్చించినట్లు తెలిపారు. యువతకు అందుబాటులో ఉండే అవకాశాలను, అలాగే విదేశాలకు వెళ్లే భారత కార్మికులు ఆధారపడే సహాయ వ్యవస్థలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే కీలకమైనవని, శిక్షణ కేంద్రాలపై మరింత బలమైన పర్యవేక్షణ, వలస కార్మికులకు మెరుగైన భాషా నైపుణ్యాలు వంటి సహాయం, అలాగే శిక్షణ తో ఉద్యోగాలు మరియు జీవనోపాధికి దారితీసేలా పిఎమ్‌కెవివై 4.0ను మరింత స్పష్టంగా, సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని సభ్యులు ప్రస్తావించారన్నారు. అదే విధంగా, కార్మిక, ఉపాధి, జౌళి, స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖల 2025–26 ఆర్థిక సంవత్సర డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై సిద్ధం చేసిన 'డ్రాఫ్ట్ యాక్షన్ టేకన్ రిపోర్ట్స్'ను కూడా కమిటీ పరిశీలించి ఆమోదించిందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

## చిక్కం సత్తిరాజు జూనియర్ కళాశాల 25 వసంతాల వేడుకలు

### వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు, అమూడా చైర్మన్



అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి చిక్కం సత్తిరాజు జూనియర్ కళాశాల 25 వసంతాల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు. ఈ కార్యక్రమంలో బొర్రా ఈశ్వరరావు, మండేలా బాబి , నల్లా చిట్టి బాబు, చిక్కాల సతీష్, గోకరకొండ నాగేంద్ర, కూటమి నాయకులు కార్యకర్తలు.

### గర్భిణీలు ప్రసవ సమయంలో మరణాలు సంభవించకుండా

# నివారణ చర్యలను బలోపేతం చేయండి..

### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : మానవాళిని కాపాడే శక్తి కలిగిన వైద్య వృత్తి ద్వారా గర్భిణీలు ప్రసవ సమయంలో మరణాలు సంభవించకుండా నివారణ చర్యలను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు మాతా శిశు మరణాల రేటు, ప్రసవ సమయంలో గర్భిణీల మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రసవ సమయంలో సుమారు 5 గర్భిణీలు ఇటీవల మరణించినట్లు గుర్తించామన్నారు. ఈ యొక్క మరణాలు సంభవించడానికి గల కారణాలను అన్వేషించి పూర్తిస్థాయి నివేదికను అందించాలని వైద్యులను ఆదేశించారు. భవిష్యత్తులో మరణాలు రేటు తగ్గించేందుకు వైద్యులు అన్నివిధాల పాటు పడాలన్నారు. ప్రసవ సమయంలో గర్భిణీ మరణం పెద్ద ప్రజారోగ్య సమస్యగా గుర్తించాలని ఆయన వైద్యులకు సూచించారు గర్భధారణ-ప్రసవ నిర్వహణలో సకాలంలో వైద్య సేవలు అందకపోవడం, సంక్లిష్టతలను ముందుగా గుర్తించి మెరుగైన వైద్య సేవలు ఉన్నచోటకి తరలించాలన్నారు. తీవ్ర రక్తస్రావం ప్రసవానంతరం అధిక రక్తనష్టం గర్భిణీ మరణాలకు కారణాలుగా ఉన్నాయని వీటిని అధిగమించే ప్రయత్నాలు చేయాలని సూచించారు. రక్తం గడ్డకట్టే సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. శిక్షణ పొందిన వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరన్నారు. హైపర్ టెన్షన్ అధిక రక్తపోటు తలనొప్పి, కాళ్ల వాపు వంటి వ్యాధులపట్ల పర్యవేక్షణ ఉండాలన్నారు. యాంటీ బయోటిక్స్ శుభ్రత, స్టెరైల్ టెక్నిక్లు సమయానుసారం ప్రసవ ప్రణాళికను గుర్తించకపోతే అధిక రక్తస్రావం జరిగి ప్రాణాంతకమవుతుందన్నారు. ప్రసవ సవాళ్లు ఆలస్యం మరణాలకు నిజమైన మూల కారణంగా ఉండి సమయానికి సాయం అందక పోవడం వైద్య సేవలు అవసరం అనిపించడంలో జాప్యాలు చేయడం, సమయానికి వైద్య సంస్థకు చేరడంలో ఆలస్యం, ఆసుపత్రిలో సేవలు అందడంలో ఆలస్యం, రక్తహీనత,శరీర పోషక లోపాలతో పాటుగా గుండె, మూత్రపిండాల సమస్యలు, ప్రసవ ప్రమాదాన్ని మరింత పెంచే అవకాశం ఉందని వీటి నివారణ కైప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు, అర్హతగల వైద్యుల పర్యవేక్షణలో ప్రసవం, అత్యవసర రవాణా సదుపాయం సముచిత పోషకాహారం ఐరన్ ఫోలిక్ ఆమ్లాలు ఆసుపత్రులలో రక్త నిల్వలు అత్యవసర శస్త్రచికిత్స సదుపాయాలు, గర్భిణీ ప్రసవ మరణాలు పూర్తిగా నివారించగలిగే అవగాహనతో సకాలంలో మెరుగైన ఆరోగ్య వనరులు ద్వారా మరణాలను తగ్గించాలన్నారు. పల్లంకుర్రు పీహెచ్సీ పరిధిలో గత ఆగస్టు నెలలో బి.స్వాతి ప్రసూతి మరణం పై పీహెచ్సీ వైద్యులు నీలిమ ద్వారా విచారించారు. ఈ కేసు పూర్వపరాలపై వైద్యుల ద్వారా విచారించగా ఆమె తరచుగా హైదరాబాదులో నివాసం ఉంటూ వైద్య సేవలకు పిహెచ్సి పరిధిలో అందు బాటులో ఉండేది కాదని కాన్పు సమయంలో జనతా క్లినిక్ ముమ్మిడివరంలో జాయిన్ అయ్యి ప్రసవ సమయంలో గుండె పోటు తో మరణించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో దుర్గారావు దొర డి సి హెచ్ ఎస్ కార్తీక్, డాక్టర్ భరత్ లక్ష్మి, డాక్టర్ సుమలత, ప్రైవేట్ ప్రసూతి వైద్యులు గిరిజ శారద అనంత లక్ష్మి పాల్గొని మరణాలు సంభవించడానికి గల కారణాలను జిల్లా కలెక్టర్ వారికి వివరించారు.

# చంద్రబాబు అంటే మోసం.. సత్యానందరావు అంటే దోపిడీ..

### కోటి సంతకాల సేకరణ ప్రతులను జెండా ఊపి జిల్లా కార్యాలయం వద్దకి పంపించిన జిల్లా అధ్యక్షులు చిర్ల



రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ : 20 సంవత్సరాలుగా ప్రమోషన్లకు నోచుకొని ఎంపిడిఓ లను డివిల్‌డివోలుగా పదోన్నతి కల్పించిన ఘనత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ది, ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేనే ఏర్పాటు చేశానని క్రెడిట్ చోరికి ప్రయత్నం చేయడం హాస్యాస్పదం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలోని జిల్లా వై. యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్న లిడాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ పేదవారికి ప్రభుత్వ వైద్యం దూరం చేసి, కార్పొరేట్లకు దోచి పెట్టాలనే దుర్బుద్ధితో కూటమి ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వచ్చింది అని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. 17వ తేదీన కోటి సంతకాల ప్రతులను మా పార్టీ నాయకులు వై.యస్.జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్‌కు అందిస్తారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని కోరడం జరుగుతుంది అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి సెట్టింగులు, అసత్య ప్రచారాలు, హంగులు, ఆర్భాటాలు, దోపిడీలు, కక్ష రాజకీయాలతో కాలం వెళ్లదీస్తున్నారని జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. అరకొరగా తల్లికి వందనం ఇచ్చి చేతులు దులుపుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిది అని ఇలా ఇచ్చిన హామీలు ఏమి అమలు చేయకుండా అన్ని అమలు చేసేసాం అని చెప్పే గొప్ప నాయకుడు ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే అని దుయ్యబట్టారు.నియోజకవర్గంలో జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తపేటలో మరల వైసీపీ రాదని చెప్తున్నారు, అన్నదమ్ములు ఇద్దరు కలిసి ఎంత దోచేస్తున్నారో ప్రజలే గమనిస్తున్నారని, ఇది సోషల్ మీడియా కాలం మీరు చేస్తున్న దోపిడీ ఎంత దాచినా దాగదు అని తెలుసుకుంటే మంచిది అని, అలాగే అధికారంలో ఎవరు ఉంటారో అది చెప్పాల్సింది మీరు కాదు ప్రజలు అని తెలుసుకుంటే మంచిది అని హితవు పలికారు.అలాగే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపల్లి దేవస్థానంలో ఏర్పాటు చేసుకున్న కలెక్షన్ ఏజెంట్ గురించి మీ హయాంలో ఆలయంలో జరుగుతున్న అపచారాల గురించి, దోపిడీ గురించి మీ నాయకులే కోడై కూస్తున్నారు. ఆలయంలో హుండీ లెక్కింపులో టీడీపీ నాయకుడు డబ్బు చోరీ చేసి దొరికిపోతే చర్యలు శూన్యం, వాడపల్లి ఆలయంలో హుండీ దోపిడీలు ఈ తెలుగుదేశం హయాంలోనే ఎందుకు జరుగుతాయో ప్రజలు అందరూ గమనించాలి.ఏది ఏమైనా 18 నెలల్లోనే ప్రజలు కళ్ళు తెరుచుకున్నారని, మరల వైసీపీ అధికారంలోకి వస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గ నియామకంపై

# జగ్గిరెడ్డి చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాం..



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : దోపిడీకి చిరునామా జగ్గిరెడ్డి వారు ఇతరులపై ఆరోపణ చేస్తున్నారు. ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గ నియామకంపై జగ్గిరెడ్డి చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాం. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం భక్త జనుల సందోహంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది దేవస్థానం ప్రాచుర్యాన్ని గుర్తించి గత ప్రభుత్వమే డిసి పరిధిలోకి దేవాలయాన్ని తీసుకు వచ్చింది.దీంతో ధర్మకర్త మండలి సభ్యుల సంఖ్య 17 కు చేరుకుంది. గతంలో 11 మంది సభ్యులు ఉండేవారు, అందుకు అనుగుణంగా నియోజకవర్గ పరిధిలో నియామకాన్ని గత ప్రభుత్వాలు చేశాయి ప్రస్తుతం దేవాలయ పరిధి సభ్యుల సంఖ్య పెరగడంతో కొత్తపేట నియోజకవర్గానికి చెందిన వారు చైర్మన్‌తో సహా పదిమంది కాగా ఇతర జిల్లాలకు సంబంధించి మరో ఏడుగురికి సభ్యులుగా అవకాశ లభించింది. పాలకవర్గంలో బలహీన వర్గాలు, షెడ్యూలు కులాలు, మహిళలతో సహా 50 శాతం పైబడి నియామకం జరిపారు. ఈ పాలకవర్గానికి సంబంధించి సభ్యుల నియామకంపై జగ్గి రెడ్డి అసత్యఆరోపణలు చేశారు. సేవా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళలు, ఇతరులను సభ్యులుగా నియమించారు. పరిశీలిస్తే వారి నియామకంపై గ్రామాల్లో హర్షం వ్యక్తం అవుతుంది. మత్స్యకార వర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదని జగ్గిరెడ్డి ఆరోపిస్తున్నారు. మత్స్యకార వర్గానికి చెందిన మహిళ పాయకరావుపేట చెందిన గోసాల అప్పలనరస ఉన్నారు. జగ్గిరెడ్డి హయాంలో పాలకవర్గ చైర్మన్ పదవిని ఎంత తీసుకుని వారికి ఇచ్చారో వారి పార్టీ కేడర్‌ను అడిగితే చెబుతారు. చైర్మన్, సభ్యులును డమ్మీ చేసి పెత్తనం ఎవరు వెలగబెట్టారో భక్త జనులందరికీ ఎరుకే... అగ్నికుల క్షత్రియులు దైవంగా కొలుస్తున్న గజేంద్రుల వారి విగ్రహాన్ని వాడపల్లి దేవస్థానం సమీపంలోనే ప్రతిష్టించాలని సంఘీయులు కోరగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రతిష్టాస్తమని హామీ ఇవ్వడం జరిగింది. హామీని నిలబెట్టుకునే దిశగా ఆయన ముందుకెళుతున్నారు. జగ్గిరెడ్డిలా రావులపాలెంలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పి,గాలికి వదిలేసే తత్వం కాదు సత్యానందరావుది. గజేంద్రుడు విగ్రహాన్ని నెలకొల్పి తీరుతారు, ఎవ్వరికి ఎటువంటి సందేహం లేదు ఇక దోపిడి గురించి ఆయన మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. కొత్తపేట నియోజకవర్గంలో దోపిడీకి పర్యాయపదమే చిర్ల జగ్గరెడ్డి అధికారంలో ఉన్న కాలంలో ఏ విధంగా అక్రమాలకు పాలుపడ్డారో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు వారి యొక్క అవినీతిని కప్పిపుచ్చుకోవడం కోసమే ఎదుటివారిపై బురద జల్లడం కార్యక్రమంగా పెట్టుకున్నారు అని ముత్యాల బాబ్జి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి యల్లమిల్లి జగన్మోహన్రావు జిల్లా టిడిపి కార్యదర్శి కాసా విజయసాగర్ నియోజకవర్గం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు తెలియజేశారు.

# సైబర్ క్రైమ్ డ్రగ్ అవేర్నెస్ అవగాహన కార్యక్రమం



రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ : రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో స్థానిక హై స్కూల్ నందు విద్యార్థులకు సైబర్ క్రైమ్ డ్రగ్ అవేర్నెస్ అవగాహన కార్యక్రమం రావులపాలెం టౌన్ ఇన్స్పెక్టర్ ఎమ్.శేఖర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నేపధ్యంలో యువత మత్తుకు గంజాయికి ఆకర్షితులు కావద్దని. చదువుకుని. ఉజ్వల భవిష్యత్తుకు. పునాదులు వేసుకోవాలని. ఉన్నతమైనా ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు. గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులను ఉద్దేశిస్తూ. సెల్ పోను వాడకంపై సూచనలు ఇస్తూ అనవసర లింక్ లు ఓపెన్ చేయవద్దని. ఎవరైనా డిజిటల్ అరెస్ట్ పేరున బెదిరిస్తే భయపడవద్దని. అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవద్దని ఎవరైనా. డబ్బులు పోగొట్టుకున్నటైతే. 1930 కు 24 గంటలలో కాల్ చేసి కంప్లైంట్ చేయాలని చెప్పారు. మైనరు పిల్లలకు నడపటానికి మోటారు వాహనాలు ఇవ్వరాదని. ఏదైనా ప్రమాదం జరిగితే. మైనరు బాలల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### రామచంద్రపురం రెవిన్యూ డివిజన్

## యధాతధంగా కొనసాగుతుంది

### మంత్రి సుభాష్‌కు సీఎం చంద్రబాబు నాయుడు హామీ
### ప్రజలు ఆందోళన చెందవద్దు : మంత్రి సుభాష్



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం రెవిన్యూ డివిజన్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయం (డీఎస్పీ ఆఫీస్) ఎట్టి పరిస్థితిలో యధాతధంగా రామచంద్రపురం కేంద్రంగా కొనసాగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు హామీ ఇచ్చారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రి సుభాష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజవర్గంలో ఉన్న పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ రామచంద్రపురం రెవిన్యూ డివిజన్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయాలు అక్కడే కొనసాగుతాయని, ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనలు చెందవద్దని భరోసా ఇచ్చారు. అలాగే రామచంద్రపురం నియోజవర్గం అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయిస్తానని సీఎం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన హామీ ఇవ్వడంతో మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందవద్దని, యధావిధిగా అక్కడే పరిపాలన కొనసాగుతుందని మంత్రి సుభాష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం రైతాంగం సమస్యలపై మాట్లాడుతూ రైతుల అభీష్టం మేరకు ధాన్యం సేకరణ, కొనుగోలు 50 కిలోమీటర్ల వరకూ అవకాశం కల్పించామని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడంతోపాటు రైస్ మిల్లర్లు అందరికీ అధికార యంత్రాంగం ద్వారా తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలను నమ్మవద్దని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### టీడీపీ, జనసేన కూటమి మాదిగ నాయకుల

## అత్యవసర సమావేశం



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండల టీడీపీ జనసేన కూటమి మాదిగ నాయకుల అత్యవసర సమావేశం మండల ఎస్ సీ సెల్ అధ్యక్షులు యార్లగడ్డ మమ్ము అధ్యక్షతన జరిగినది ఈ సమావేశానికి టీడీపీ రాష్ట్ర హెచ్ ఆర్ డి సభ్యులు నేదునూరి వీర్రాజు ముఖ్య అతిథిగా పాల్గొనీ ఈ జిల్లాలో కపట ఆత్మీయ కలయిక పేరుతో మాదిగలను వంచించటానికి మరోసారి సిద్ధమైన యం ఎల్ సి బొమ్మి ఇశ్రాయేల్ స్వార్థ నీచ రాజకీయ కుయుక్తులను కోనసీమ యావత్ మాదిగ జాతి గమనిస్తుందని, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మాదిగ జాతి చిరకాలవాంఛ నెరవేర్చి మాదిగ జాతిలో వెలుగులు నింపిన సీఎం చంద్రబాబునాయుడుని విమర్శించడానికి నీకు నోరెలా వచ్చిందని, మాదిగ జాతి ద్రోహి జగన్‌కు నీవు ఈ మాదిగ జాతిని తాకట్టు పెట్టాలనే నీ ప్రయత్నాలు ఇక సాగనివ్వమని దుయ్యబట్టారు.నీ స్వార్థ రాజకీయ స్వలాభంకోసం మాదిగల మహాత్ముడు కృష్ణమాదిగ ని కూడా ఒక మాఫియా అని ప్రచారం చేసిన నీవు ఆయన ఫోటో ఎలాపెట్టుకున్నావని,నీకు జాతిపై అభిమానమే గనక ఉంటే మాదిగల ద్రోహి జగన్ ఇచ్చిన పదవి వదలి మాదిగల ఆత్మీయ కలయిక పెట్టాలని సూచించారు. జెఏసి పేరుతో నమ్మబలికి ఒక్కసారిగా చంద్రబాబు ని విమర్శించారంటే ఇప్పటికైనా కనువిప్పు కలగాలని డిసెంబర్11, 4వ వార్షికోత్సవం అని పోస్టర్ లో ముద్రించినపుడు మీరు గమనించలేదా ఆది ప్రతిసంవత్సరం జరిగే వైసీపీ డేట్ అని ఆ తారీఖున మాదిగల ఆత్మీయ కలయిక అంటే అది వైసీపీ మీటింగ్ అవ్వుతుందని జాతి పరువును తాకట్టు పెట్టుకున్న ఇటువంటి కపట ఆత్మీయ కలయికలను ప్రోత్సహించవద్దని యావత్ మాదిగ జాతి కోనసీమలో జనవరి 25న జరిగే ఆత్మీయ కలయిక కోసం ఎదురు చూస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్డి సభ్యులు ఎదునూరు వీర్రాజు, మండల ఎస్సీ సెల్ నాయకులు జనసేన నాయకులు యార్లగడ్డ సతీష్ చిర్రా నాగరాజు ఇతర పెద్దలు పాల్గొన్నారు.

## అక్షయ సంస్థ ఆర్థిక సహాయం



రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ : అమలాపురం మండలం పేరూరి గ్రామానికి చెందిన పిల్ల నాగ దుర్గాప్రసాద్ కొబ్బరి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి పడిపోవడం వలన వెన్నుపూస విరిగిపోవడం జరిగింది దాతల సహకారంతో ఆపరేషన్ చేయించుకున్నారు ఆరు నెలలు బెడ్ రెస్ట్ తీసుకుంటూ మందులు వాడాలని డాక్టర్లు చెప్పారు ఈయనకి ఇద్దరు ఆడపిల్లలు దుర్గాప్రసాద్ కి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థను సహాయం కోరగా సంస్థ నుంచి.10000 రూపాయలు. దండుప్రోలు విజయ్ 1000. కొండ్రెడ్డి సత్యనారాయణ 1000. కే పావని 1000. లంకె వెంకటేశ్వర్లు 500. మిరియాల సుబ్బరాజు 500. మొత్తం 14000. రూపాయలు అక్షయ సేవా సంస్థ సభ్యులు చేతుల మీదుగా దుర్గాప్రసాద్ వారి భార్యకి ఇవ్వడం జరిగింది దీనికి సహకరించిన సభ్యులందరికీ సంస్థ తరుపున ధన్యవాదములు తెలిపారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

గురువారం, 11 డిసెంబర్ 2025

www.viswamvoice.com





### అట్టహాసంగా ప్రారంభమైన

# అంతరాష్ట్ర వాలీబాల్ క్రీడలు




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జెఎన్టియుకె క్రీడా ప్రాంగణంలో ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు) సహకారంతో జెఎన్టియుకె, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సురంపాలెం, రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సైన్సెస్, కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖపట్నం వెస్ట్ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు పి. గణ వెంకట రెడ్డి నాయుడు (గణబాబు) ప్రారంభించారు. జెఎన్టియుకె క్రీడా ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గణబాబు ముఖ్యఅతిథిగా విచ్చేయగా విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మరియు అర్జున అవార్డు గ్రహీత, మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి. వెంకట రమణ , గౌరవ అతిథులుగా జిల్లా మేజిస్ట్రేట్ & కలెక్టర్ సగిలి షాన్ మోహన్,ఎస్డీపివో ఎఎస్పి పాటిల్ దేవ్ రాజ్ మనీష్ ఏఐయు అబ్జర్వర్ డాక్టర్ ఇ త్రిమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి గణబాబు మాటాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడాస్ఫూర్తితో ఆడి ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. ఈ టోర్నమెంట్ కు వచ్చిన క్రీడాకారులు, కోచ్లు మరియు టీమ్ మేనేజర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జెఎన్టియుకె ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. యువత క్రీడలలో రాణించడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చునన్నారు. క్రీడాకారులకు ముఖ్యంగా క్రమశిక్షణ ఎంతో అవసరమని, దీని ద్వారా అటు చదువులోను, ఇటు క్రీడలలోను రాణించగలరన్నారు. మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి.వెంకట రమణ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకారులు కష్టపడి ఆడుతూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రీడలలో చివరి వరకు కష్టపడి ఆడినవారు ఎప్పటికైనా విజయం సాధిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన వాలీబాల్ క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి వాలీబాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఎస్డీపివో, అదనపు ఎస్పీ పాటిల్ దేవ్రాజ్ మనీష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమ ప్రాధాన్యతనివ్వాల న్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ క్రీడాకారులు తమపై తాము నమ్మకం ఉంచుకుని బాగా రాణించినపుడే విజయం సాధించవచ్చునన్నారు. అలాగే దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులను, కోచ్లను, మేనేజర్లను, యూనివర్శిటీ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. జెఎన్టియుకె ఉపకులపతి ప్రొ. సిఎస్ఆర్కే. ప్రసాద్ మాట్లాడుతూ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏజయు)కు కృతజ్ఞతలు తెలియజేస్తూ పోటీల విజయవంతానికి కృషి చేస్తున్న జిల్లా అధికారులకు, పోలీసు అధికారులకు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. క్రీడాకారులకు, అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జెఎన్టియుకె స్టేడియం, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సురంపాలెం మరియు రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సైన్సెస్లో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్లో ఇప్పటివరకు 40 మ్యాచ్లు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.పి.సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొ.ఆర్. శ్రీనివాసరావు, ఓఎస్ ప్రొ.డి. కోటేశ్వరరావ, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ మరియు టోర్నమెంట్ కన్వీనర్ డా.జి.శ్యామ్కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.జి.పి. రాజు, నగర ప్రముఖులు, క్రీడాకారులు, కోచ్లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యరంగ వృద్ధి, ఎగుమతుల విస్తరణపై

## ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నకు కేంద్రం స్పష్టత



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలోఆక్వా రంగం వృద్ధి, మార్కెట్ విస్తరణ, మత్స్యకారుల ఆర్థిక బలోపేతం, దక్షిణ భారత ఆక్వా ఉత్పత్తుల తక్షణ రవాణా సౌకర్యాల ప్రాముఖ్యతపై బుధవారం రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు , కేంద్రం సమగ్ర నివేదికను అందించింది. కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం, 2024–25లో భారత్ 16.98 లక్షల టన్నుల సముద్ర ఆహారాన్ని ?62,408 కోట్లు విలువతో 130 దేశాలకు ఎగుమతి చేసిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.రొయ్యల ఉత్పత్తిలో ముఖ్య కేంద్రంగా నిలిచిన కాకినాడ–గోదావరి ప్రాంతం ఈ ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తున్నదని కేంద్రమంత్రి పేర్కొన్నారు. అమెరికా (36%), చైనా (17%), యూరోపియన్ యూనియన్ (15%) ప్రధాన మార్కెట్లుగా నిలిచాయని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.కొత్త మార్కెట్ల విస్తరణ, విలువ జోడింపుపై కేంద్రం చేపట్టిన చర్యలు కాకినాడ నుండి రొయ్యల ప్రాసెసింగ్, ఎగుమతి యూనిట్లకు అవకాశాలను పెరుగనున్నాయి అని అన్నారు.. జీఎస్టీ తగ్గింపుతో విలువ ఆధారిత ఉత్పత్తుల ఉత్పత్తి, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లకు లాభం చేకూరే అవకాశం ఉందని కేంద్ర మంత్రులు స్పష్టం చేశారు. కొత్త మార్కెట్ల విస్తరణ కోసం ఎంపీ ఈ డి ఏ ద్వారా అవగాహన కార్యక్రమాలు, కొనుగోలుదారు–అమ్మకందారు సమావేశాలు, విలువ జోడింపుపై శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ సింగ్ పేర్కొన్నారు. దేశీయ వినియోగం పెంచేందుకు పిఎమ్ఎమ్ఎస్వై కింద 34,788 మౌలిక సదుపాయ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. విలువ ఆధారిత సముద్ర ఆహారాలపై జీఎస్టీని 12% నుంచి 5%కు తగ్గించడం వినియోగాన్ని పెంచుతుందని చెప్పారు. మత్స్యకారులకు కేసీసీ ద్వారా రూ. 2 లక్షల వరకు రుణాలు లభిస్తున్నప్పటికీ, ప్రత్యేక టాప్–అప్ లోన్లకు ప్రస్తుతం నిబంధనలు లేవని కేంద్రం మంత్రి స్పష్టం చేశారు.. దక్షిణ భారతదేశం నుండి ఆక్వా ఉత్పత్తుల రవాణా కోసం ప్రత్యేక రైలు సేవ ప్రవేశపెట్టే ప్రణాళిక లేదని రైల్వే శాఖ కేంద్రమంత్రి తెలియజేశారు.

## శ్రీ ప్రకాశ్ సైనర్జీ స్కూల్‌లో ‘బ్లిట్జ్-2025’ సైన్స్ ఫేర్



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సురేష్నగర్లోని శ్రీ ప్రకాశ్ సినర్జీ స్కూల్లో బుధవారం “బ్లిట్జ్–2025” పేరుతో సైన్స్ ఫేర్ను నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన, ఆవిష్కరణా స్ఫూర్తి పెంపొందించే లక్ష్యంతో ఈ వేడుకను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎం శ్రీదేవి తెలిపారు. ఫేర్లో సైన్స్, టెక్నాలజీ, రోబోటిక్స్, వ్యవసాయం, పర్యావరణ సంరక్షణ, ఎయిరోడైనమిక్స్ తదితర విభాగాలకు చెందిన అనేక వినూత్న మోడల్స్ను విద్యార్థులు ప్రదర్శించారు. చిన్నారుల నుండి సీనియర్ల వరకు విద్యార్థులు తమ ప్రతిభను చూపుతూ ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఐఏఎస్–ఐఎస్టీ కాకినాడ హెడ్ వి.రవీంద్ర సారథి, అమెరికాకు చెందిన సమతా వెల్లంకిలు విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. ఇలాంటి సైన్స్ ఫేర్స్ కొత్త ఆలోచనలను వెలికితీస్తాయి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతాయని వారు పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీ, హైడ్రాలిక్ సిస్టమ్స్, రోబోట్స్, యాంటి–పాల్యూషన్ పరికరాలు, సస్టైనబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంస్థ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ “విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు, వారి విజ్ఞానాన్ని విస్తరించేందుకు స్కూల్ తరచూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కాకినాడ ఎంపీ ఉదయ్‌కు కృతజ్ఞతలు తెలిపిన

## జిల్లా కాప్స్ రాక్స్ సభ్యులు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వందేమాతర గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన ప్రత్యేక చర్చలో భాగంగా మన జిల్లాకు చెందిన తొలితరం స్వతంత్ర సమరయోధుడు, కాపు ముద్దుబిడ్డ ద్వార బంధాల చంద్రయ్య దొర గురించి ప్రస్తావించడంతో పాటు, ఆయన పోరాటపటిమను పార్లమెంట్ వేదికగా తెలియచెప్పిన కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్కు కాపు రాక్స్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చరిత్రలో మరుగున పడ్డ ఒక కాపు స్వతంత్ర సమరయోధుడిని స్మరింపచేసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ చరిత్రలో నిలిచిపోయారని, కాప్స్ రాక్స్ ఫౌండర్ పెద్దిరెడ్డి శివ భాస్కర్ ఆదేశానుసారం కాకినాడ జిల్లా సభ్యులు త్వరలోనే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ని కలవడం జరుగుతుందని కాప్స్ రాక్స్ జిల్లా కోఆర్డినేటర్ నాగడమూడి సత్యనారాయణ రాజు, ఉభయ గోదావరి జిల్లా సభ్యులు తెలిపారు.

### అన్నవరం దేవస్థానం కొత్త ఈఓగా

## బాధ్యతలు స్వీకరించిన త్రినాధరావు



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి రత్నగిరి దేవస్థానం నూతన కార్యనిర్వహణ అధికారిగా వేంద్ర త్రినాధరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. కాగా ఆయన బుధవారం దేవస్థానంలో విధుల్లో చేరారు. ప్రస్తుతం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనరుగా విధులను నిర్వహిస్తున్న త్రినాధరావు లోగడ 2019 లో అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు స్వీకరించి నాలుగు సంవత్సరాల పాటు సేవలను అందించారు. త్రినాధరావుకు రాష్ట్రంలోని వివిధ ప్రధాన దేవాలయాల్లో డిప్యూటీ కమిషనర్, రీజనల్ జాయింట్ కమిషనర్ హెరీదాల్లో సేవలను అందించిన అనుభవం ఉంది. ఈయనను రత్నగిరి దేవస్థానం ఈవోగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు రాగా బుధవారం తొలిగా సత్యనారాయణ స్వామిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వాదం పొందారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు బాధ్యతలను స్వీకరించారు. ట్రాఫిక్ నియంత్రణ, అన్నదానం, వసతి వంటి అంశాలపై దృష్టి సారించి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మీడియాకు వేంద్ర త్రినాధరావు తెలిపారు. మంగళవారం వరకూ రత్నగిరి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా విధులను నిర్వహించిన వీర్ల సుబ్బారావు తన పూర్వపు మాతృ శాఖకు బదిలీ అయ్యారు.

## డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా

### టీడీపీ నేత బొదిరెడ్డి గోపి



**ఏలేశ్వరం, విశ్వం వాయస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం నగర పంచాయతీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం చేపట్టారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి హాజరయ్యారు. నగర పంచాయతీ పరిధిలో మూడు నాలుగొవ వార్డులలో సుమారు 90 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి అని అన్నారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. మహిళలు డ్వాక్రా సంఘాలను సక్రమంగా నిర్వహిస్తూ ఆర్థిక పురోగాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పలువురు మహిళలు స్థానిక సమస్యలు కోతుల బెడద వివరించగా గోపి సానుకూలంగా స్పందించారు. నగరం లో కోతులు బెడద ఎక్కువగా ఉండేదని ఇప్పటికే దాని నివారణ చర్యలు చేపట్టామని. త్వరలోనే పూర్తిస్థాయిలో అరికట్టే దిశగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రసాద్, రుచి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ బోర్డు పథకాల అమలుకై

## 12న జరిగే సదస్సును జయప్రదం చేయండి..

### భవన నిర్మాణ కార్మికులకు పథకాల అమలపై ప్రభుత్వం పండగలోపు తీపి కబురు తెలియజేయాలి



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్క్స్ ఏఐటియుసి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు అమలుకే కాకినాడలో సాంబమూర్తి నగర్ రెవెన్యూ కాలనీ రోడ్ పి.ఆర్ భవన్లో డిసెంబర్ 12న శుక్రవారం ఉదయం జరిగే సదస్సును జయప్రదం చేయాలని, ఈ సదస్సుకు తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రిషన్లు, పెయింటర్లు, ప్లంబింగ్, వడ్రంగి తదితర రంగాల కార్మికులు హాజరు అవ్వాలని ఏపీ బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పిలుపు నిచ్చారు. బుధవారం ఉదయం కాకినాడలో నిర్మాణ రంగ కార్మికుల అడ్డాల వద్ద సదస్సు కరపత్రాలు పంపిణీ చేసి విస్తృతంగా వీర్ కమల్ సెంటర్, కరణం గారి సెంటర్, కొండయ్యపాలెం, దుర్గా నగర్, గుడారిగుంట, అయోధ్య నగర్, దుమ్ములపేట, గ్లాస్ హౌస్ సెంటర్,జై రామారావు పేట తదితర ప్రాంతాల కార్మికుల అడ్డాల వద్ద సదస్సు కోసం విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. దీనికి ముఖ్య అతిథి గా ఏపీ బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ క్లెయిమ్స్ 110 కోట్లు నిధులు ఉన్నాయని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు ఐదు కోట్ల రూపాయలు పైగా క్లెయిమ్స్ పెండింగ్లో ఉన్నాయని, భవన నిర్మాణ కార్మికులకు క్లెయిమ్స్ నిధులు మంజూరు చేయకుండా స్కిల్ డెవలప్మెంట్ పేరుతో 70 కోట్లు నిధులు కేటాయిస్తున్నా రని, ఎన్ని కోట్లు నిధులు కేటాయించిన స్థానికులకు పనులు కల్పించకుండా ఇతర రాష్ట్రాల వారికే పనులు కల్పిస్తున్నారని పథకాల అమలు చేయడంలో పాలకులు విఫలం చెందుతున్నారని ఆయన అన్నారు. వాడ దాటకముందు వాడ మల్లన్న వాడు దాటిన తర్వాత బోడి మల్లన్న అనే చందంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల రాకముందు భవన నిర్మాణ కార్మికులకు హామీ ఇచ్చిందని, భవన నిర్మాణ కార్మికుల ఓట్లతో గద్దెనెక్కి మాట మార్చుతున్నారని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్మిక శాఖ మంత్రికి ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసిన ప్రతిఫలం లేదని, కార్మిక శాఖ మంత్రికి భజన చేసే ఆత్మగౌరవ సభలు ఎన్ని నిర్వహించిన ప్రయోజనం లేదని, ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని, పండగ లోపు భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలపై ప్రభుత్వం తీపి కబురు తెలియజేయాలని, లేదంటే పండగ తర్వాత భవన నిర్మాణ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కలిసి వచ్చిన సంఘాలన్నిటిని కలుపుకుని పథకాల అమలు చేసే వరకు ఉద్యమిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నమ్మి బాలకృష్ణ, సత్యనారాయణ, వినోద్ కుమార్, త్రినాథ్, సూరిబాబు, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఫుడ్ కమిషన్ దృష్టి



### పౌష్టికాహారం పంపిణీలో లోపాలు సహించం ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల పౌష్టికాహారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తున్న తరుణంలో, ఆ నిధుల ప్రయోజనం విద్యార్థులకు నిజంగా చేరేలా చూడటం తమ ప్రధాన బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా నగరంలో పలు రేషన్ షాపులను, ఇంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పంపిణీ వ్యవస్థ, వంటశాల, స్టాక్ రిజిస్టర్లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు, అంగన్వాడి కేంద్రాలకు ప్రభుత్వం రూపకల్పన చేసిన మెనూతోపాటు పౌష్టిక ప్రమాణాలకు తగ్గట్టుగా భోజనం అందించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో భారీ నిధులు విడుదల చేస్తుండగా, వాటిని సరైన విధంగా వినియోగించి విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికమైన ఆహారం అందించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలదేనని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత, మెనూ ఫాలో అవుతున్న తీరు పట్ల ఎలాంటి అలసత్వం సహించబోమని హెచ్చరిస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలి. నాణ్యతా ప్రమాణాల్లో రాజీపడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు స్పష్టంగా తెలిపారు. పాఠశాలలో వంట శాల పరిశుభ్రత, భోజనం నాణ్యతపై ఆయన అధికారులు, సిబ్బందికి అనేక సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మిడ్డే మీల్స్లో నాణ్యత పెంపుతో పాటు పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.ఈసాక్, ఫుడ్ డిపార్ట్ మెంట్ పి.వి గోపాల్, ఇన్స్పెక్టర్ సుబ్బారావు, కెవివి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### సిఐటియు అఖిల భారత మహాసభలకు

## జనవరి 4న చలో విశాఖ

### డిసెంబర్ 15 కార్మికుల ఇండ్లపై అరుణ పతాకావిష్కరణ

### జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం పిలుపు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) అఖిలభారత 18వ మహాసభలు 2025 డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న నేపథ్యంలో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ జనవరి 4న చలో విశాఖ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్. విజయకుమార్ అధ్యక్షతన జిజిహెచ్ ప్రాంగణంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్కా వెంకటరమణ మాట్లాడుతూ 1970 లో సిఐటియు ఏర్పడిందని, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2000 సంవత్సరంలో హైదరాబాదులో మహాసభ జరిగిందన్నారు. ప్రస్తుతం 18 వ అఖిలభారత మహాసభలు విశాఖ నగరంలో జరుగుతున్నాయన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ లేబర్ కోడ్ లు తీసుకొచ్చిందన్నారు. కార్మిక హక్కుల రక్షణ, చట్టాల పరిరక్షణకై ఈ మహాసభల్లో చర్చించి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. పలివెల వీరబాబు మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభల నేపథ్యంలో డిసెంబర్ 15న తేదీన ప్రతి కార్మికుడు తమ ఇంటిపై అరుణ పతాక ఆవిష్కరణ చేయాలన్నారు. కార్మికుల నివాస ప్రాంతాలలో సిఐటియు మహాసభల గురించి ప్రచారం నిర్వహించాలన్నారు. సంఘాల్లో లేని కార్మికులను సంఘటితం చేయాలని సిఐటియు పిలుపు ఇస్తోందన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు జె.శేషు, ఆర్.రమేష్, ఎం.ఏసు, ఎస్.వాసు, జి.కళ్యాణ్, బి.కృష్ణవేణి, బి.మంగతాయారు, డి.శారద, బి.శ్రీకాంత్, డి.దుర్గాప్రసాద్, ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుండి అనూహ్య స్పందన 57,812 సంతకాల పత్రాలు

### ఉద్యమాల కోటి సంతకాల సేకరణ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పేదల వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను తక్షణమే నిలుపుదల చేయాలంటూ చేస్తున్న సంతకాల సేకరణ ఉద్యమం కాకినాడలో హోరెత్తించింది. మాజీ సీఎం, వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు కాకినాడ సిటీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే , కాకినాడ సిటీ మేజర్ గా ఇంచార్జ్ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం ముమ్మరంగా సాగింది. పార్టీ నాయకులు కార్యకర్తలు కాకినాడ నగరంలో ప్రజల వద్ద నుండి సేకరించిన 57,812 సంతకాల ప్రతులను కాకినాడ నగరంలోని వైఎస్ఆర్సిపి కార్యాలయం నుండి కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో జిల్లా పార్టీ కార్యాలయానికి భారీగా బైక్ ర్యాలీతో తరలి వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి చేసిన మంచి పనులు భూస్థాపితం చేయాలన్న చంద్రబాబు కుట్రతో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని ద్వారంపూడి విమర్శించారు.. రాష్ట్రంలో ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల వాటికి అనుబంధంగా ఉండే బోధన ఆసుపత్రులలో పేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందదని చెప్పారు. ఇంకా రోగనిర్ధరణ అలాగే ఇన్ పేషెంట్ మెడిసిన్స్ కి చార్జ్ చేస్తారని ఆరోపించారు. ఇదిలా ఉండగా మరో వైపు రాష్ట్రం పెద్ద సంఖ్యలో మెడికల్ సీట్లు కోల్పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం ఒక చరిత్రగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం పి పిపి పేరిట డ్రామాలు ఆడుతోందని ప్రజలకు అర్థమైందని వివరించారు. వైయస్సార్సీపి ప్రభుత్వం దిగిపోయేసరికి వాటిలో దాదాపు రూ. 3 వేల కోట్ల విలువైన పనులు జరిగినట్లు పేర్కొన్నారు. కొత్త మెడికల్ కాలేజీల కోసం ఏటా రూ. 1000 కోట్ల చొప్పున అయిదు ఏళ్ళు వ్యయం చేస్తే చాలని, కానీ ప్రభుత్వం ఆ దిశలో ఆలోచన చేయకుండా, పిపిపి పేరుతో ప్రైవేటీకరణ పై ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ధ్వజమెత్తారు. వీటన్నిటి నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు కూడా పూర్తిచేసి అన్నిటిని ప్రభుత్వం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసాన్నసాగర్, మాజీ కూడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి కుమార్, నల్లబెల్లి సుజాత, పసుపులేటి వెంకటలక్ష్మి, శంకర్, రాంబాబు, కార్పొరేటర్లు బన్నీ, కంప్ర బాబి, సంఘాని నందం, అజ్జు, అల్లి రాజబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
గురువారం, 11 డిసెంబర్ 2025
www.viswamvoice.com


# ఆసుపత్రి సంఘటన తీవ్రంగా కలచివేసింది

**ప్రభుత్వ ఆసుపత్రిలో దురదృష్టకర సంఘటన - రాజమండ్రిని ఒక ఆదర్శ నగరంగా మార్చాలన్నదే నా ధ్యేయం..**
**మోరంపూడి ప్లైఓవర్, రోడ్ల సమస్యల పరిష్కారిస్తాం - భరత్ విమర్శలు అర్థంలేనివి ..అందుకే విమర్శలు పట్టించుకోను**
**ప్రభుత్వాసుపత్రి పరిశీలించిన ఎమ్మెల్యే వాసు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొన్ని రోజులక్రితం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక గర్భిణీ ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం కారణంగా మరణించడం దురదృష్టకర సంఘటన అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఈ విషయం నన్ను ఎంతగానో కలచివే సిందని, తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని ఆయన అన్నారు. ప్రభుత్వా సుపత్రి గైనిక్ వార్డ్ ను ఎమ్మెల్యే వాసు బుధవారం ఉదయం సందర్శించి, రోగుల ఆరోగ్య పరిస్థితులపై విచారణ చేసారు. వైద్య సేవలు, సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు మీడియాతో మాట్లాడుతూ గర్భిణీ మరణించిన సంఘటన గురించి తెలియగానే, తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి,ఆ ప్రసూతి వార్డు పరిస్థితి, ఇలాంటివి ఎన్ని జరుగుతు న్నాయి. ఎందుకు జరుగుతున్నాయి అనే వివరాలు తెలుసుకున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం గెలిచినప్పటి నుండి ప్రజా ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,'ఆరోగ్య రాజమండ్రి' నినాదంతో ముందుకు వెళ్తున్నామని ఇందులో భాగంగా, ఆసుపత్రి అభివృద్ధి కోసం చేస్తున్న పనుల గురించి ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియాలని మీడియా ద్వారా చెబుతున్నానని ఎమ్మెల్యే వాసు గుర్తు చేసారు. ఇప్పుడు ఆసుపత్రిని సందర్శించి, డాక్టర్లు ఇచ్చిన నివేదికలను పరిశీలించాక, ఆ అధిక రక్తస్రావంతో మరణించడం వంటి కేసులు చాలా అరుదుగా జరుగుతాయని వారు చెప్పారని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న ఔట్-పేషెంట్ (ఒపి) సంఖ్యతో పోలిస్తే, ప్రస్తుత ప్రభుత్వంలో ఎంతో వ్యత్యాసం ఉందని, సంఖ్య గణనీయంగా పెరిగిందని ఈ విషయాలను 2023, 2024, 2025 సంవత్సరాలలో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా గైనకాలజీ వార్డులో వచ్చి చూయించుకుంటున్న గర్భిణీల సంఖ్య కూడా విపరీతంగా పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న చికిత్స, అందిస్తున్న సేవల కారణంగా రాజమండ్రి ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం పెంచగలిగామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లను ట్రీట్ చేసే విధానాన్ని బట్టే సగం జబ్బు నయమవుతుంది. మాజీ ఎంపీ భరత్ చేసిన వ్యాఖ్యల గురించి ఎమ్మెల్యే వాసు ప్రస్తావించారు. రాజకీయాల్లో గెలవడం, ఓడడం అనేది సర్వసాధారణ మని, దాని గురించి అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని అయితే మొన్నటి వరకు ఈవీఎంలు అన్నాడు. ఈవీఎంల గురించి 'మీకేమైనా అనుమానాలు ఉంటే మోదీ గారిని అడగండి' అని మేము చెప్పగానే, ఈవీఎంలు అనడం మానేశాడని గుర్తుచేశారు. ఇప్పుడేమో 'డబ్బులు పంచి నెగ్గాం' అని అంటున్నాడు. నేను డబ్బులు పంచి నెగ్గితే, మరి గతంలో జగన్ ఎలా నెగ్గారని ఆయన ప్రశ్నించారు. భరత్ ఏదేదో మాట్లాడుతున్నారని, ఆయనే కాదు, ఎవరు ఎన్ని విమర్శలు చేసినా, నేను పట్టించుకోనని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న కూటమి ప్రభుత్వానికి, నాకు ప్రజా సేవ తప్ప వేరే ధ్యాస లేదు. నా పూర్తి దృష్టి రాజమండ్రి అభివృద్ధిపై, ప్రజల సమస్యల పరిష్కారంపైనే ఉంటుందని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేసారు.

**ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో ఆదిరెడ్డి అప్పారావు కృషి కూడా ఉంది**

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో ఎంతో మంది కృషి ఉందని ఎమ్మెల్యే వాసు అన్నారు. అందులో ముఖ్యంగా మాజీ శాసన మండలి సభ్యులు ఆదిరెడ్డి అప్పారావు కృషి కూడా ఉందన్నారు. అప్పట్లో వైద్య ఆరోగ్య మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ కృషి ఉందని ఆయన అన్నారు. అప్పట్లో ఇది నేను ప్రత్యక్షంగా చూశానని ఆయన గుర్తుచేసారు. ఇక్కడ గైనక్ హెడ్ ఆవిడ వలన ఇక్కడ అనేక ఇబ్బందులు వస్తుంటే, మంత్రి కామినేనితో అప్పారావు మాట్లాడినవన్నీ కూడా నేను ఇంకా మర్చిపోలే దన్నారు. అలా కష్టపడి తెచ్చుకున్న వాటికి ఇప్పుడు ఏదైనా ఇబ్బంది వస్తుంటే,ఎలా ఊరుకుంటాం? అని ఆయన ప్రశ్నించారు. ఆసుపత్రికి ఇంకా చేయవలసింది చాలా ఉందని,నియమకాలు చేసుకోవలసిన అవసరం ఉందని,కాలేజీ అనుసంధానం అవ్వడం వల్ల కొన్ని ఇబ్బందులు తగ్గుతున్నాయని ఆయన అన్నారు.మంత్రి సత్యకుమార్ యాదవ్ చాలా సహకరిస్తున్నారని ఆయన తెలిపారు.

**మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద గుంతలకు శాశ్వత పరిష్కారం**

మోరంపూడి ఫ్లైఓవర్ సిటీ నియోజకవర్గంతో పాటు రూరల్ నియోజకవర్గానికి కూడా వెళ్తుందని, అంతకంటే ముఖ్యంగా ఇది ఎంపీ పరిధిలో ఉంటుందని ఎమ్మెల్యే వాసు అన్నారు. అయినా సరే, అందరూ ఇది సిటీలోకి వస్తుందనే ఉద్దేశ్యంతో నన్నే లక్ష్యంగా చేసుకుని ప్రశ్నిస్తుంటే, నేను కూడా చేయాల్సింది చేయాలనే ఉద్దేశంతో, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి, దీన్ని పరిష్కరించడానికి ముందుకు వచ్చానని ఆయన తెలిపారు. వర్షాల వల్ల రోడ్ల పనులు ఆలస్యం అయిన మాట వాస్తవమేనని, అందుకే మొదట, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని పూర్తి చేశామని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

**జగన్‌కు పుట్టిన ఆలోచనే**

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం

**మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలి**
**కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో రెండు రోజులలో 50 వేలకు చేరిక**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ఈ రోజు కోటి సంతకాల సేకరణ చరమాంకం చేరుకున్న నేపథ్యంలో రాజమండ్రి సిటీ నియోజకవర్గం నుండి సుమారు 40వేల సంతకాల పత్రాలను జిల్లా పార్టీ కార్యాలయానికి జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ పంపారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ కరోనా సమయంలో వేలకువేలు ప్రజల ప్రాణాలు సరి అయిన వైద్య సేవలు లేక గాలిలో కలిసిపోతుంటే అప్పుడు జగనన్న కు పుట్టిన ఆలోచనే రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం ఇప్పటికే 5 కాలేజీలు రెండవ సంవత్సరం నడుస్తున్నాయి. ప్రజా సంక్షేమ వ్యతిరేకి నారా చంద్రబాబు నాయుడుకి పుట్టిన దుర్మార్గపు ఆలోచన మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ దీని ద్వారా తన మనుషులకు వేల కోట్లు ధనార్జన కోసం ఈ దుర్మార్గపు ఆలోచనకు శ్రీకారం చుట్టారు. దీనిని జగనన్న పార్టీ వ్యతిరేకిస్తూ గత కొన్ని రోజులుగా రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాష్ట్రమంతటా చేస్తుంటే ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తూ వారే స్వచ్ఛందంగా వచ్చి కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారు. ఈ నెల 16 వ తారీఖున రాష్ట్ర గవర్నర్ ని కలసి మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ ఆపాలని కోరనున్న జగన్ పార్టీ మరియు విద్యార్థులు ప్రజలు. ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న వైఎస్ఆర్సీపీ శ్రేణులు రాష్ట్రమంతటా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసి అవసరమైతే ఈ విషయంలో హైకోర్టు లేదా సుప్రీమ్ కోర్టు కన్నా వెళ్లి విద్యార్థుల ఆశలను ప్రజల శ్రేయస్సు కోసం పోరాడతామని ఈ సందర్భముగా భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళలు,ప్రజలు పాల్గొన్నారు.

## డిసెంబర్ 12న జాబ్ మేళా

**కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "వికాస" ఆధ్వర్యంలో డిసెంబర్ 12 వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు రాజమహేంద్రవరం కలెక్టరేట్ పరిసరాల్లోని "వికాస కార్యాలయం" (బొమ్మూరు హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా)లో జాబ్ మేళా నిర్వహి స్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటన లో తెలియ చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్,ఎం బి ఎ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.10,000/- నుండి రూ.25,000/- వరకు వేతనం, అదనంగా ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సదుపాయాలు ఆయా సంస్థల ప్రకారం అందజేయబడతాయి. ఆసక్తిగల అభ్యర్థులు తమ అసలు సర్టిఫికెట్లతో పాటు జెరాక్స్ కాపీలు తీసుకొని తప్పనిసరిగా హాజరు కావాలనీ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే.లచ్చారావు కోరారు. మరిన్ని వివరాల కోసం : 7660823903 లేదా వెబ్‌సైట్ : www.vikasajobs.com ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవాలనీ తెలియ చేసారు.

**మండల వ్యాప్తంగా**

## అంగన్‌వాడీ పిల్లలకు మెరుగైన వైద్యం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని అన్ని అంగన్వాడి సెంటర్ల యందు పిల్లలకు మెరుగైన వైద్యం అందాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సీతానగరం మండల వ్యాప్తంగా అంగన్వాడి సెంటర్ల యందు పిల్లలకు మెరుగైన వైద్యం అందించడానికి సిద్ధంగా ఉన్నామని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ఏపీకే చైతన్య, ఇ.యేసు రాణి తెలిపారు. ప్రతి పిల్లవాడిని పరీక్షించి వయసుకు తగ్గ ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షించి ఇంకా ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా అని సమగ్రంగా పరీక్షించి అవసరమైన పిల్లలకు తగిన వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమములో పీహెచ్ఎన్ జి.దైవకృప, సూపర్వైజర్ కె.సుధాకర్, ఐఎస్‌సిడిఎస్ సూపర్వైజర్ కె.పెద్దలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

**సెల్‌ఫోన్, డిజిటల్ పరికారాలను**

# తక్కువగా వినియోగించాలి

**- డిజిటల్ హింసపై మహిళలు,బాలికల్లో అవగాహన సదస్సులు**
**- ప్రముఖ గైనకాలజిస్ట్,రోగ్స్ అధ్యక్షురాలు డాక్టర్ సజ్జా పద్మ**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలు, యువతులపై జరుగుతున్న డిజిటల్ హింస, దాడులను సమాజంలోని ప్రజలు చైతన్యవంతం అయినపుడే అడ్డుకోగలమని ప్రముఖ గైనకాలజిస్ట్, రాజమండ్రి అబ్‌స్టేట్రిక్, గైనకాలజీ సొసైటీ(రోగ్స్) అధ్యక్షురాలు డాక్టర్ సజ్జా పద్మ పేర్కొన్నారు. స్థానిక ఐఎంఎ హాల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సజ్జా పద్మ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ ఆర్గనేజేషన్(యుఎన్ఓ) నవంబర్ 25 మహిళలపై హింస నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, బాలికలపై జరుగుతున్న డిజిటల్ దాడులకు వ్యతిరేకంగా నవంబర్ 25 నుండి 16రోజుల పాటు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపు నిచ్చిందన్నారు. అబ్‌స్టేట్రిక్, గైనకాలజీ సొసైటీ ఇందులో భాగస్వామ్యమై డిజిటల్ హింసపై మహిళలు, బాలికల్లో చైతన్యం నింపేందుకు ఈ 16 రోజులు పాటు రోగ్స్ ఆధ్వర్యాన స్కూల్స్, కళాశాలలు, సంక్షేమ హాస్టల్స్‌లో అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫారంకు దూరంగా ఉండటం, ఒకవేళ డిజిటల్ హింసకు గురైతే ఎవరికి ఫిర్యాదు చేయాలి, ఎలా రక్షణ పొందాలన్న అంశాలపైనా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మగ పిల్లల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉన్నప్పుడే డిజిటల్ దాడుల నుండి మహిళలు, బాలికలకు రక్షణ లభిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో రోగ్స్ కార్యదర్శి డాక్టర్ కంభంపాటి లలిత, జాయింట్ సెక్రటరీ డాక్టర్ సునీత పరాంకుశం,కో ట్రెజరర్ శ్రీజ్యోష్న అనపర్తి, డాక్టర్ లక్ష్మి ప్రసన్నలు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం లోని ఎంపీపీ మోడల్ ప్రైమరీ పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగుకు ముఖ్య అతిథిగా సొసైటీ అధ్యక్షులు కాండ్రు శేఖర్ పాల్గొన్నారు. శేఖర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసముతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భముగా విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమమునకు ఎంఈఓ స్వామి నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కలిసినపు చిన్నబాబు జ్ఞాపకార్థం పేదలకు భోజన సమర్పణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మందికి అన్నదాన కార్యక్రమాన్ని కొవ్వూరు మండల చిడిపి గ్రామంలోని స్వర్గీయ కలిసినపు చిన్నబాబు పేరిట వారి కుటుంబ సభ్యులు కొవ్వూరు గోష్పాద క్షేత్రం దగ్గర ఉన్న పేదవారికి,రాజమండ్రి పుష్కర్ ఘాట్ దగ్గర ఉన్న పేదవారికి భోజన సమర్పణ అందించారు. ఈ కార్యక్రమంలో దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు, అనపర్తి రాజు,తొర్లపాటి రాజీవ్,ప్రభాస్ లు పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డి ఎల్ఎస్ఎ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మిలు జిల్లా జడ్జ్ కార్యాలయంలో బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 13న 4వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు జాతీయ న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. జిల్లా కోర్ట్ ఆవరణలో న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడ్డదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు, తదితర కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సంవత్సరం లో జరగిన గత 3 జాతీయ లోక్ అదాలత్ లో 756 సివిల్ కేసులు, 547 యాక్సిడెంట్ కేసులు, 15431 రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, 518 ప్రీ-లిటిగేషన్ కేసులు, మొత్తం 17073 కేసులు పరిష్కరించబడ్డాయి,పరిష్కరించ బడిన మొత్తం సొమ్ము 100,99,11,504/- అక్షరాల వంద కోట్ల తొంబై తొమ్మిది లక్షల పదకొండు వేల ఐదు వందల నాలుగు రూపాయలని తెలిపారు. 2024 సంవత్సరంలో జరిగిన 4 జాతీయ లోక్ అదాలత్ లలో 2131 సివిల్ కేసులు, 7796 రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, 696 ప్రీ - లిటిగేషన్ కేసులు, మొత్తం 10623 కేసులు పరిష్కరించబడ్డయి, మొత్తం పరిష్కరించబడిన మొత్తం సొమ్ము 162,35,24,590/- అక్షరాల నూట అరవై రెండు కోట్ల ముప్పై ఐదు లక్షల ఇరవై నాలుగు వేల ఐదు వందల తొంబై రూపాయలని తెలిపారు. డిసెంబర్ 13వ తేదీన జరుగు జాతీయ లోక్ అదాలత్ కు 46 బెంచులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైకోర్టు ధర్మాసనం ఆదేశాల మేరకు ట్రాఫిక్ చలనా కేసులు కూడా జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చు. అదే విధముగా ఎక్సైజ్ కేసులలో కూడా డ్యూటి పేయిడ్, నాన్ డ్యూటి పేయిడ్ కేసుల ను కూడా రాజీ చేసుకోవచ్చు. ఈ జాతీయ లోక్ అదాలత్ కు 18,035 కేసులను రాజీ చేయడానికి గుర్తించడం జరిగినది. కావున అందరూ ఈ జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ పర్యవేక్షణలో దేశవ్యాప్తంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ జరుగుతోంది. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించడం, ప్రజలకు తక్కువ ఖర్చుతో న్యాయం అందించడం, రాజీ ద్వారా చట్టపరమైన వివాదాలను ముగించేందుకు ఈ లోక్ అదాలత్ ముఖ్య వేదికగా నిలుస్తోంది. రాజీపడ్డ కేసులకు కోర్టు ఫీజు రీఫండ్ లభించడం, అలాగే తీర్పులు తుది తీర్పులుగా పరిగణించబడడం వల్ల ప్రజలు పెద్ద ఎత్తున ప్రయోజనం పొందుతున్నారు. న్యాయసేవ ప్రజల ఇంటిగడప చేరాలన్న లక్ష్యంతో స్నేహపూర్వక న్యాయ పరిష్కారాలను అందించడం లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం అన్నారు.

# మోటార్ సైకిళ్ళ దొంగలు అరెస్టు..

**29 ద్విచక్ర వాహనాలు స్వాధీనం. - రికవరీ విలువ సుమారు రూ.17,40,000/-**
**వాహనాలకు జీపీఎస్, వీల్ లాక్లు ఏర్పాటు చేసుకోవాలి**
**మీడియా సమావేశంలో వెల్లడి చేసిన డి.ఎస్.పి వై. శ్రీకాంత్**
**3వ పట్టణ పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం త్రీ టౌన్ (లా అండ్ ఆర్డర్) పోలీస్ స్టేషన్ పరిధిలో రాజమహేంద్రవరం చుట్టు ప్రక్కల ప్రాంతాలలో మోటార్ సైకిల్ దొంగతనాలు ఎక్కువగా జరగడం వలన దానిపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాలు మేరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డి.ఎస్.పి వై శ్రీకాంత్ ఉత్తర్వుల మేరకు రాజమహేంద్రవరం 3వ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వి.అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై ఎండి జుబేర్,త్రీ టౌన్ (లా అండ్ ఆర్డర్ ) పోలీస్ స్టేషన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ వి కృష్ణ,ఎన్ వెంకట,ఎస్. చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు అనువారు 2025 డిసెంబర్ 10వ తేదిన రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్లు క్వారి సెంటర్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల మగ ఆసామి పోలీస్ వారిని గమనించి పారిపోవుటకు ప్రయత్నించగా అతడిని పోలీస్ సిబ్బంది పట్టుకొని మధ్యవర్తుల సమక్షంలో విచారించగా అతడు ఈ క్రింది విధంగా తెలిపాడు. అతని పేరు "సబ్బు వీరబాబు,27 సం.ల వయస్సు,కాపు, ఇందుకూరుపేట గ్రామం, దేవీపట్నం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా."అని చెప్పి , అతడి తల్లిదండ్రులు అతడి చిన్న తనంలోనే చనిపోయినట్లు, అతడిని వాళ్ళ అమ్మమ్మ దగ్గర పెంచినట్లు, అతడు రాజమహేంద్రవరంలో పుష్కర ఘాట్ వద్ద మహాదేవ హొటల్లో నైట్ బాయ్ గా పనిచేస్తూ, పగటి సమయంలో వెల్డింగ్ పనులకు వెళ్తున్నట్లు, అతడికి మోటార్ సైకిల్ లేకపోవడంతో ఒక రోజు రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద మోటార్ సైకిల్ వుండగా దానిని అతని వద్ద వున్న మారు తాళం తో తీయగా వచ్చేసినట్లు, అంతట దానిని కొంతకాలం వాడుకుని తదుపరి అతడి స్నేహితులు అయిన కోసూరి పవన్ కుమార్ మరియు జర్గాని అప్పన్న అను వారితో మాట్లాడి పాత మోటార్ సైకిల్ నా వద్ద వున్నాయి, కొనుగోలు చేస్తారా అని అడుగగా వారు సరే అనడంతో వారికి నేను రాజమండ్రి పుష్కర్ ఘాట్, కోటగుమ్మం, మల్లయ్యపేట, సుబ్రహ్మణ్య మైదానం, లాలచేరువు రోడ్డు, ఇస్కాన్ గుడి, ఆత్రేయపురం మండలం వాడపల్లి పరిసర ప్రాంతాలలో మోటార్ సైకిళ్ళు దొంగతనం చేసినట్లుగా చెప్పినాడు. సదరు దొంగతనం చేసిన మోటార్ సైకిళ్ళలో కొన్ని డబ్బులు తీసుకొని ఈ క్రింది వ్యక్తులకు ఇచ్చినట్లు, వారు ఇచ్చిన డబ్బులు ఖర్చు పెట్టుకున్నట్లుగా చెప్పినాడు.

1) మోటార్ సైకిళ్ళు ఇచ్చిన వారి వివరములు.

కోసూరి పవన్ కుమార్, తండ్రి లింగయ్య , వయస్సు 20 సం. లు, కులం కొండరెడ్డి, మటం భీమవరం గ్రామం, కొయ్యూరు మండలం.

2) జార్గాని అప్పన్న , తండ్రి నాగేశ్వరరావు, వయస్సు 27 సం. లు, కులం యస్ కఈ మాల, అచ్యుతాపురం గ్రామం, గోకవరం మండలం.

సదరు వీరబాబు దొంగిలించబడిన మోటార్ సైకిళ్ళ పై రాజమహేంద్రవరం 3 టౌన్ (లా%డ%ఆర్డర్) పోలీస్ స్టేషన్, 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదు అయి ఉన్నవి. డిసెంబర్ 10వ తేదీన ముద్దాయి ని అరెస్ట్ చేసి అనంతరం రిమాండ్ రిపోర్ట్ తో కోర్ట్ వారి ముందు హాజరు పరుస్తామని అన్నారు.దీనికి సంబంధించిన కేసులో ప్రతిభ కనపరిచిన పట్టణ లాండర్ పోలీసు వారిని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అబినందించారు. డి.ఎస్.పి వై. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలు తమ బైక్ లకు,వీల్ లాక్లు, మరియు జిపిఎస్ లు పెట్టుకోవాలని తగు జాగ్రతలు తీసుకోవలసిందిగా ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియపరిచారు.

# ఈ హీరోయిన్ ఏంట్రా బాబు
# ఇలా మారిపోయింది..

## 17 ఏళ్లకే పెళ్లి, విడాకులు.. ఇప్పుడు స్టార్ హీరో భార్య.



దక్షిణాదిలో అందంతో కట్టిపడేసిన హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ సైతం సౌత్ సినీప్రియుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న ముద్దుగుమ్మ. రాజ వంశానికి చెందిన అమ్మాయి. కానీ జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. 17 ఏళ్లకే ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె.. తక్కువ వెంటనే విడాకులు తీసుకుంది. అందంలో ఆమె అప్సరస. తెలుగు, తమిళం, హిందీ భాషలలో తనదైన ముద్ర వేసింది. నటనతోపాటు అందంలోనూ కట్టి పడేసింది. తక్కువ సినిమాలే చేసినప్పటికీ ఇండస్ట్రీలో తనదైన మార్క్ చూపించింది. ముఖ్యంగా డైరెక్టర్ మణిరత్నం సినిమాల్లో ఆమె పోషించిన పాత్రలు అడియన్స్ హృదయాల్లో నిలిచిపోయాయి. రాజవంశానికి చెందిన ఈ అమ్మాయి నటనపై ఆసక్తితో సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. ఆమె మరెవరో కాదండి.. హీరోయిన్ అదితి రావు హైదరీ. ఆమె తాత 1896 నుంచి 1941హైదరాబాద్ ప్రధాన మంత్రిగా పనిచేశారు. వనపర్తి రాజ కుటుంబానికి వారసురాలు ఆమె. చిన్న వయసులోనే సినీరంగంలోకి అడుగుపెట్టింది. 17 ఏళ్ల వయసులోనే సత్యదీప్ అనే వ్యక్తితో ప్రేమలో పడింది. ఆ తర్వాత ఇద్దరు పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. కానీ కొన్నాళ్లకే ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత చాలా కాలం ఒంటరిగా ఉన్నా అదితి రావు హైదరీ.. ఇప్పుడు కొత్తగా వైవాహిక బంధంలోకి అడుగుపెట్టింది. సౌత్ హీరో సిద్దార్థ్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరు కలిసి తెలుగులో మహాసముద్రం సినిమాలో నటించారు. అప్పుడే ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ప్రస్తుతం ఎవరి కెరీర్ లో వారు బిజీగా ఉన్నారు. 2006లో ప్రజాపతి సినిమాతో నటిగా తెరంగేట్రం చేసిన అదితి.. ఇప్పుడు సరైన అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. అదితి తెలుగుతోపాటు తమిళం, హిందీ భాషలలో నటించింది. హిందీలో ఢిల్లీ 6 సినిమాతో నటిగా పరిచయమైన ఆమె.. ఆ తర్వాత 2018లో విడుదలైన పద్మావత్ సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన హీరామండి వెబ్ సిరీస్ ద్వారా మరింత పాపులర్ అయ్యింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో అదితి షేర్ చేసిన ఫోటోస్ వైరల్ గా మారాయి.

సినీ వాయిస్ CINEMA

# నటి ప్రగతిపై ట్రోల్స్..

## ఘాటుగా స్పందించిన సింగర్ చిన్మయి.. మరి అలా అనేసిందేంటి..





టాలీవుడ్ సీనియర్ నటి పవర్ లిఫ్టింగ్ లో పతకాల వర్షం కురిపిస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ లో ప్రగతి నాలుగు పతకాలు గెల్చుకుంది. ఒక బంగారు పతకంతో పాటు మూడు రజిత పథకాలను ఖాతాలో వేసుకుంది. టాలీవుడ్ సీనియర్ నటి ప్రగతి గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఎన్నో సినిమాల్లో స్టార్ హీరోలు, హీరోయిన్లకు అత్తగా, అమ్మగా, అక్కగా, వదినగా.. ఇలా అన్ని రకాల సహాయక నటి పాత్రలతో తెలుగు ఆడియెన్స్ కు చేరువైందీ అందాల తార. అయితే గత కొంత కాలంగా సినిమాలకు పూర్తిగా దూరంగా ఉంటోంది ప్రగతి. దీనికి బదులు పవర్ లిఫ్టింగ్ లో సత్తా చాటుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాల వర్షం కురిపిస్తూ సాటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. తాజాగా టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2025లో పాల్గొన్న ప్రగతి ఏకంగా నాలుగు పతకాలు గెలుచుకుంది. ఇందులో ఒక బంగారు పతకంతో పాటు మూడు రజత పతకాలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం ప్రగతి పేరు సోషల్ మీడియాలో తెగ మార్మోగుతోంది. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఈ సీనియర్ నటికి అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ప్రస్తుతం అందరి ప్రశంసలు అందుకుంటోన్న ప్రగతి గతంలో పలు విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో జిమ్ ఫొటోలను షేర్ చేసినప్పుడు కొందరు ఆమెను తీవ్రంగా ట్రోల్ చేశారు. నెగెటివిటీ కామెంట్స్ తో విరుచుకు పడ్డారు. అయినా ప్రగతి ఈ విమర్శలను పట్టించుకోకుండా తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకుందంటూ ఒక నెటిజన్ సోషల్ మీడియాలో ఒక ఇంట్రెస్టింగ్ పోస్ట్ షేర్ చేశాడు. దీనికి సింగర్ చిన్మయి స్పందించింది. ట్విట్టర్ ద్వారా ప్రగతి గురించి చెబుతూ ఒక పోస్ట్ పెట్టింది.. 'ప్రగతి గారి ఫొటోల గురించి అసభ్యకరమైన కామెంట్లు పెట్టినవారు వాళ్ల జీవితంలో ఏం సాధించారు? అలాంటివారు ఎప్పటికీ ఏమి సాధించలేరు. అలాగే అమ్మాయిలు.. మీరు కూడా ప్రగతి గారి నుంచి స్ఫూర్తి పొంది ముందుకు వెళ్లండి. మీపై వచ్చే చెడు కామెంట్లను తీసి పక్కన పడేయండి అలాగే మీరు భవిష్యత్తులో ఇలాంటి వారి కుటుంబంలోకి వెళ్లకుండా జాగ్రత్తపడండి' అని రాసుకొచ్చింది. ప్రస్తుతం చిన్మయి పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. చాలా మంది నెటిజన్లు ఆమెకు మద్దతుగా కామెంట్స్ పెడుతున్నారు.

క్రీడా వాయిస్

# మొహాలీలో కింగ్ ఎవరు..

## పిచ్ రిపోర్ట్‌తో టెన్షన్‌లో ఇరుజట్లు..?




ఐపీఎల్ టోర్నమెంట్‌లో ఈ మైదానంలో ఆరు మ్యాచ్‌లు జరిగాయి. సగటు మొదటి ఇన్నింగ్స్ స్కోరు 170 పరుగులు కాగా, సగటు రెండవ ఇన్నింగ్స్ స్కోరు 154 పరుగులుగా నిలిచింది. ఈ మైదానంలో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయడం ప్రయోజనకరంగా ఉంది. భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య రెండవ టి 20 చండీగఢ్‌లోని మొహాలీలో జరుగుతుంది. భారత జట్టు మొదటి టి20 లో దక్షిణాఫ్రికాను 101 పరుగుల భారీ తేడాతో ఓడించి 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికా ఈ మ్యాచ్‌లో తిరిగి విజయం సాధించాలని చూస్తోంది. ఈ మ్యాచ్‌కు సంబంధించి పిచ్, టాస్, వాతావరణ పరిస్థితులను ఓసారి చూద్దాం..

ఇండియా/సౌత్ఆఫ్రికా 2వ టి20 ఎక్కడ, ఎప్పుడు జరుగుతుందంటే:

మ్యాచ్: ఇండియా %జం% దక్షిణాఫ్రికా

స్టేడియం: మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ముల్లన్పూర్, మొహాలి.

మ్యాచ్ తేదీ: డిసెంబర్ 11, 2025 (సాయంత్రం 07:00)

ప్రత్యక్ష ప్రసారం (భారతదేశంలో): స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్, డీడీ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో చూడొచ్చు.

హెడ్-టు-హెడ్ గణాంకాలు:

ఇరుజట్ల మధ్య మొత్తం 10 మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో భారత్ 6 మ్యాచ్‌ల్లో గెలవగా, దక్షిణాఫ్రికా 4 మ్యాచ్‌లు గెలిచింది. ఇక గత 5 మ్యాచ్‌ల్లో భారత జట్టు 4 గెలవగా, దక్షిణాఫ్రికా 1 మ్యాచ్ గెలిచింది.

మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పిచ్ నివేదిక:

మొహాలీలోని ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఇప్పటివరకు 2 టి20లు మాత్రమే జరిగాయి. మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ సులభంగా కనిపించింది.

ఐపీఎల్ టోర్నమెంట్‌లో ఈ మైదానంలో ఆరు మ్యాచ్‌లు జరిగాయి. సగటు మొదటి ఇన్నింగ్స్ స్కోరు 170 పరుగులు కాగా, సగటు రెండవ ఇన్నింగ్స్ స్కోరు 154 పరుగులుగా నిలిచింది. ఈ మైదానంలో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయడం ప్రయోజనకరంగా ఉంది.

అంచనా: ఎవరు ఎక్కువ పరుగులు చేస్తారు?

హార్దిక్ పాండ్యా : గత మ్యాచ్‌లో అతను 59 పరుగులతో అత్యధిక స్కోరు సాధించాడు. ఈ మ్యాచ్‌లో కూడా 30 నుంచి 40 పరుగులు చేయగలడు.

అభిషేక్ శర్మ: అతను భారత జట్టు ఓపెనింగ్ బ్యాట్స్‌మన్. అతను ఈ మైదానంలో చాలా మ్యాచ్‌లు ఆడాడు. గత మ్యాచ్‌లో 17 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో అతను భారీ ఇన్నింగ్స్ ఆడగలడు.

అంచనా: ఎవరు ఎక్కువ వికెట్లు తీస్తారు?

లుంగి న్గిడి : గత మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్, ఈ మ్యాచ్‌లో కూడా ఒకటి లేదా రెండు వికెట్లు తీయవచ్చు.

అర్ష్‌దీప్ సింగ్ : అతను ఈ మైదానంలో చాలా మ్యాచ్‌లు ఆడాడు. గత మ్యాచ్‌లో అతను రెండు వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కూడా అతను రెండు నుంచి మూడు వికెట్లు తీయగలడు.

అంచనా: ఏ జట్టు గెలుస్తుంది?

రెండో టీ20 మ్యాచ్‌లో కూడా భారత జట్టు విజయం సాధించవచ్చు. భారత బౌలర్లు దక్షిణాఫ్రికా కంటే చాలా బాగా బౌలింగ్ చేశారు. ఈ మ్యాచ్‌లో కూడా వారు తమ ప్రదర్శనను పునరావృతం చేయవచ్చు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ పేలవమైన ఫామ్‌లో ఉండటం టీమ్ ఇండియాకు ఆందోళన కలిగిస్తుంది. మరోవైపు, దక్షిణాఫ్రికా కూడా తమ బ్యాట్స్‌మెన్స్ నుంచి మెరుగైన ప్రదర్శనను ఆశిస్తుంది.

ప్రాబబుల్ ప్లేయింగ్:

భారత్ : అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, జితేష్ శర్మ (వికెట్ కీపర్), శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా.

దక్షిణాఫ్రికా : క్వింటన్ డి కాక్ (కీపర్), డొనవన్ ఫెరీరా, ఐడెన్ మార్క్‌రామ్ (కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, డెవాల్డ్ బ్రూయిస్, డేవిడ్ మిల్లర్, మార్కో జాన్సెన్, లూథో సిపమ్లా, కేశవ్ మహరాజ్, ఎన్రిక్ నార్జ్, లుంగీ ఎంగ్డి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com